
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 4 నవంబరు 2025

గరిష్ఠం 30.0
కనిష్ఠం 21.0
****



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.30 (309.9534)	41,915	41,915
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.70 (4.12)	4,927.28	4,927.28
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.8661)	35,365	17,000

చికెన్ ధరలు	లైవ్ : రూ.140	డ్రెస్ : రూ.230	స్కిన్‌లెస్ : రూ.250

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పెండింగ్ పనులను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించి రెండేళ్లలో పూర్తిచేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 22న ఇన్‌లెట్‌లో పనుల ప్రదేశంలో టన్నెల్ కుప్పకూలి ఎనిమిది మంది కార్మికులు మృతి చెందడంతో పనులు నిలిచాయి. టన్నెల్‌లో ఇకపై ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తవ్వకం పూర్తిచేసేందుకు చేపట్టిన హెలిబోర్న్ ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వేను సోమవారం సొరంగమార్గం అవుట్‌లెట్‌వైపున నాగర్‌కర్నూల్ జిల్లా మన్నెవారిపల్లి వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు.
- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)



సీఎం, మంత్రులకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనుల్లో కీలక అడుగు

- హెలిబోర్న్ ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వే ప్రారంభం
- అవుట్‌లెట్ వద్ద ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి
- ఆర్మీ సహకారంతో ఆధునిక సాంకేతికత
- రెండేళ్లలో పనుల పూర్తికి హామీ
- ప్రమాదరహితంగా, పర్యావరణ హితంగా పనులు సాగిస్తామని ప్రకటన
- నిర్వాసితులకు డిసెంబరు నెలాఖరునాటికి పునరావాసం కల్పిస్తామని భరోసా



హెలిబోర్న్ ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వేలో సొరంగమార్గంలో ప్రతీ 250 మీటర్ల భూభాగంలో 1,000మీటర్ల లోతువరకు ఎలాంటి రాతి శిలలు న్నాయి? జలవనరులున్నాయి? ఇతర నిర్మాణా లు ఏమున్నాయనే అంశాలను గుర్తించి వాటికి అనుగుణంగా తవ్వకాలను చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించనుంది. ఈ సర్వే ను వీలైనంత వేగంగా పూర్తిచేసి సొరంగమార్గంలో పెండింగ్ ఉన్న సుమారు 9.800 కిలోమీటర్ల తవ్వకాన్ని వచ్చే రెండేళ్లలో పూర్తి చేయించి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3లక్షల ఎకరాలకు సాగునీరు,30లక్షల జనాభాకు తాగునీ రు అందిస్తామని సీఎం,మంత్రులు ప్రకటించారు.

అటవీభూమి బదలాయింపూ పెండింగ్‌లోనే



ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టులో భాగంగా తెల్దేవర్‌పల్లి వద్ద నిర్మిస్తున్న నక్కలగండి రిజర్వాయర్‌లో (డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ఫారెస్ట్‌కు చెందిన 281.93 హెక్టార్ల భూమి ముంపునకు గురవుతోంది. ఈ భూములను ప్రాజెక్టుకు కేటాయించేందుకు కేంద్ర అటవీ శాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. అందుకోసం ఇప్పటికే కేంద్ర అటవీశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారిక సంప్రదింపులు పూర్తయినా, ముందడుగు పడలేదు. ఈ భూమిని కేంద్రం కేటాయిస్తే, దీనికి బదులుగా రిజర్వ్‌ఫారెస్ట్ ఆవల ఇతర ప్రాంతాల్లో 790 హెక్టార్లలో అడవిని అభివృద్ధి చేసి ఇచ్చేందుకూ రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధతను వ్యక్తం చేసింది. కీలకమైన ఈ అనుమతులు వస్తేనే నక్కలగండి రిజర్వాయర్ అందుబాటులోకి వస్తుంది. ప్రాజెక్టు పనులతో పాటు ఈ అటవీ భూమి బదలాయింపు అంశంపైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాల్సి ఉంది.

ఆర్మీ సహకారంతో..

ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గాన్ని రిజర్వ్‌ఫారెస్ట్ లో తవ్వుతుండగా, 2005లో ఈ ప్రాజెక్టు చేపట్టినప్పుడు అప్పట్లో దేశంలో ఎక్కడాలేని రీతిలో టన్నెల్ బోరింగ్ యంత్రం ద్వారా పనులు ప్రా రంభించారు. కీలకమైన టన్నెల్-1 నిర్మాణాన్ని రెండువైపుల నుంచి చేపట్టారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకునే ప్రాంతం నుంచి చేపట్టిన ఇన్‌లెట్ టన్నెల్ 19.500 కిలోమీటర్లకు ఇప్పటివరకు 13.935 కిలోమీటర్లు పూర్తికాగా, ఇంకా 6.015 కిలోమీటర్ల సొరంగం...

- మిగతా 6వ పేజీలో...

ఎస్‌ఎల్‌బీసీని పూర్తిచేయడమే లక్ష్యం
- ఎమ్మెల్యే బాలునాయక్



దేవరకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్ని అడ్డంకులు ఎదురైనా అధిగమించి శ్రీశై లం సొరంగమార్గాన్ని పూర్తిచేసి నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్-1 ఎలక్ట్రోమ్యాగ్నేటిక్ సర్వే ప్రారంభానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలి సి ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, ఈప్రాజెక్టును పూర్తిచేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారన్నారు. భద్రత, నాణ్యత విషయంలో రాజీపడకుండా పనులు నిర్వహించి ప్రపంచస్థాయి ఇంజనీరింగ్ ప్రాజెక్టుగా ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్-1 రికార్డుస్థాయిలో నమోదవుతుందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేవరకొండ, అచ్చంపేట నియోజకవర్గాలకు పూర్తిస్థాయిలో సాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందన్నారు. ఈ సందర్భంగా సీఎం, మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ప్రైవేట్ కళాశాలల యజమానులు

రీయింబర్స్‌మెంట్ కోసం
పోరుబాట

- ఉమ్మడి జిల్లాకు రూ.400 కోట్ల బకాయి
- కళాశాలల మూతతో 40వేల మంది విద్యార్థులపై ప్రభావం
- కళాశాలల బంద్ సంపూర్ణం

నల్లగొండ, మిర్యాలగూడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ప్రైవేట్ కళాశాలల యజమానులు, విద్యార్థులు పోరుబాటపట్టారు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ విద్యా సంస్థలు బంద్‌ను పాటించాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 83 కళాశాలలు ఉండగా, వివిధ కోర్సుల్లో మొత్తం 40వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 2021-22 విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వం సుమారు రూ.400 కోట్ల మేర రీయింబర్స్ చెల్లించాల్సి ఉంది. అయితే దసరా సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని కళాశాలలకు కేవలం రూ.300కోట్లు మాత్రమే విడుదల చేయగా, ఉమ్మడి జిల్లాకు రూ.4కోట్ల నుంచి రూ.5కోట్ల వరకు మాత్రమే వచ్చినట్లు తెలుస్తోంది. కాగా కళాశాలల బంద్‌తో 40వేల మంది విద్యార్థుల చదువులపై ప్రభావం పడనుంది. 6

సాగర్ గేట్ల మూసివేత

7

ప్రమాదాల నివారణకోసం
భారీ హోర్డింగ్

- ఎస్పీ శరత్‌చంద్రపవార్



చిట్యాల మండలం వెలిమినేడు వద్ద హోర్డింగ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

చిట్యాలరూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా నివారణ, అవగాహన కల్పించేందుకు రహదారి పక్కన భారీ ఫ్లెక్సీతో కూడిన హోర్డింగ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడు శివారులో జాతీయ రహదారి పక్కన ట్రాఫిక్‌పై అవగాహనలో భాగంగా జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులకు ప్రమాదాల నివారణకోసం ఏర్పాటు చేస్తున్న భారీ హోర్డింగ్‌ను ఎస్పీ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 65వ నంబరు రహదారిపై నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయని, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వెలిమినేడు శివారులో రహదారి పక్కన భారీ హోర్డింగ్ ఏర్పాటు చేసి, దానిపై పెద్ద ఫ్లెక్సీని కట్టి ప్రమాదానికి గురైన వాహనాల చిత్రాలను ముద్రించి ప్రమాదాలు జరగకుండా అవగాహన కల్పించనున్నామన్నారు. ప్రతీ ఒక్కరి ప్రాణాలు ఎంతో విలువైనవని, జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. ఎస్పీ వెంట నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, నార్కట్‌పల్లి సీఐ కైగూరి నాగరాజు, నల్లగొండ ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య ఉన్నారు.

చెర్వుగట్టు క్షేత్రం మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష
హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖ ఛాంబర్‌లో చర్చ



నార్కట్‌పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్‌పై సోమవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. హైద్రాబాద్ సచివాలయంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కార్యాలయం సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌తో పాటు దేవాదాయ శాఖ ప్రత్యేక సలహాదారు గోవిందహరితో పాటు ఇంజనీరింగ్ విభాగం అధికారులు కలిసి సమీక్షలో పాల్గొన్నారు. ఆలయానికి ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన మహిమాన్విత శిలాజాలు, మూలవిరాట్టు ఉన్న ఆలయం జోలికి పోకుండా భక్తుల మనోభావాలకు ఏ మాత్రం భంగం కలగకుండా ఆగమశాస్త్ర ప్రకారం చేయాల్సిన అభివృద్ధి పనుల మాస్టర్ ప్లాన్‌పై విస్తృతంగా చర్చించారు.

దేవస్థానం అభివృద్ధిలో కీలకంగా మారనున్న రెండో ఘాట్‌రోడ్డు, గిరి ప్రదక్షిణ, పారిశుధ్యం, అద్దె గదులు, ఇటు నార్కట్‌పల్లి నుంచి అటు ఎల్లారెడ్డిగూడెం నుంచి చెర్వుగట్టుకు చేరుకునే జిల్లా పరిషత్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరణ చేయడం వంటి అంశాలపై సమీక్షలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. ప్రధానంగా భక్తులకు కనీస వసతులు మెరుగయ్యేలా మరో వందేళ్ల వరకు ఉపయోగపడేలా రూపొందించాల్సిన మాస్టర్ ప్లాన్‌లో చేర్చే అంశాలపై సమీక్షించారు. రెండో ఘాట్ రోడ్డు, గిరి ప్రదక్షిణ, రోడ్డు వెడల్పులో నివాసాలు కోల్పోయే వారికి చేయాల్సిన ప్రత్యామ్నాయ అవకాశాలపై ప్రాథమికంగా చర్చకు వచ్చింది. ఐతే మరో పర్యాయం సుదీర్ఘంగా సమీక్ష చేసి మాస్టర్ ప్లాన్‌కు తుదిరూపం ఇవ్వాలని సమీక్షలో నిర్ణయించారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశం

మర్రిగూడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులను ఇబ్బంది పెట్టకుండా పత్తి మిల్లు యాజమాన్యం 14శాతంమ్యాచర్ వచ్చిన పత్తిని కొనుగోలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం మండలంలోని ఎరగండ్లపల్లి గ్రామ సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహ ఆగ్రో పత్తి మిల్లును సందర్శించి తనిఖీ చేశారు. పత్తి మిల్లులకు తీసుకొచ్చిన పత్తి రైతులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ వల్ల పత్తి తడిసిముద్దయిందని, దీంతో తీవ్రంగా నష్టపోయామని, పత్తి తడిసిందని మిల్లు యజమాన్యం ఎలాంటి షరతులు కొర్రీలు పెట్టకుండా పత్తిని కొనుగోలు చేసే విధంగా చూడాలని, రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. పత్తికొనుగోలులో రైతులకు ఎలాంటి షరతులతో కూడిన కొర్రీలు పెట్టవద్దని మిల్లు యాజమాన్యానికి సూచించారు. పత్తి విక్రయాలకోసం ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న రైతులు పత్తి మిల్లులో కొనుగోలు ఆలస్యం అయితే తిరిగి మరుసటి రోజు ఆన్‌లైన్ బుక్ చేసుకోవాలని రైతులకు సూచించారు. అదేవిధంగా పత్తి విక్రయాల కోసం ఇతర జిల్లాల నుంచి వచ్చిన రైతులకు ప్రాధాన్యత ఇవ్వకుండా, పత్తి కొనుగోలు విషయంలో మర్రిగూడ మండలానికి చెందిన రైతులకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని యజమాన్యాన్ని ఆదేశించారు. ఈమె వెంట ఆర్డీవో శ్రీదేవి, మర్రిగూడ తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాస్, మండల స్పెషల్ అధికారి వేణుగోపాల చారి, ఎంపీడీవో మునయ్య పలువురు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తేమ పాటిస్తేనే పత్తికి మద్దతు ధర: కలెక్టర్

మునుగోడు : ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం తేమ శాతం నిబంధనలు పాటిస్తేనే రైతులు పండించిన పత్తికి మద్దతు ధర లభిస్తుందని లభిస్తోందని జిల్లా కలెక్టర్ అన్నారు. మునుగోడు సలాసర్ బాలాజీ పత్తి జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం శీతాకాలం మంచు కురువడంతో పాటు వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ఉదయం సమయంలో కాకుండా ఎండ వచ్చిన సమయంలో మాత్రమే పత్తి తీయటం పనులు చేయాలన్నారు. కలెక్టర్ వెంట చండూరు ఆర్డీవో శ్రీదేవి, మునుగోడు తహసీల్దార్ నరేష్ నేలపట్ల, ఎస్సై ఇరుగు రవి, సీసీఐ బయ్యర్ బాలాజీ నింజీ, రైతులు తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్

నల్లగొండ : ప్రజావాణిఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. సోమవారం మొత్తం ఫిర్యాదులు 90 రాగా, జిల్లా అధికారులకు 41, రెవెన్యూ శాఖకు 49 వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, గృహ నిర్మాణ పీడీ రాజ్ కుమార్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, నల్లగొండ ఆర్డీవో .వై అశోక్ రెడ్డి ,చండూర్ ఆర్డీవో శ్రీదేవి, అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులును స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులపై దృష్టి సారించి త్వరతగతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. సమావేశానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, ఇన్‌చార్జి డీఆర్‌వో వై. అశోక్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవోలు హాజరయ్యారు.

వివరాలు సక్రమంగా నమోదు చేయాలి

తిప్పర్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : జనగణన కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న సర్వేను సక్రమంగా నిర్వహించాలని జనగణన విభాగ స్టేట్ డైరెక్టర్ భారతి హోళికేరి అన్నారు. సోమవారం తిప్పర్తి మండల కేంద్రంలోని రైతువేదికలో జరిగే జనగణన సర్వే శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. సర్వే రిపోర్టుపై ప్రజల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని అన్నారు. నమోదు చేసే ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా పరీక్షించి చేయాలని సూచించారు. నాలుగు సంవత్సరాల క్రితం చేయాల్సిన సర్వే కరోనా కారణంగా చేయలేకపోయామని ప్రస్తుతం అవకాశం ఉన్నందున విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆమె వెంట జేడీ.లాజర్, తహసీల్ధార్ ఆర్.రామకృష్ణ, ఆర్ఐ ద్రోణాఅర్జున్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న జనగణన విభాగ రాష్ట్ర డైరెక్టర్ భారతిహోళికేరి

బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

చండూరు, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చేంత వరకు సీపీఐ పోరాడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం పార్టీ మునుగోడు నియోజకవర్గ కార్యవర్గ సమావేశం చండూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ ప్రక్రియను ముందుకు తీసుకుపోయే క్రమంలో బీజేపీ కనుసన్నల్లో పని చేస్తున్న తెలంగాణ గవర్నర్ బిల్లును అడ్డుకుంటున్నారని విమర్శించారు. భారీ వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వర్షాలతో తడిసిన పత్తికి షరతులు లేకుండా గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరారు. డిసెంబరు 26వ తేదీన ఖమ్మంలో నిర్వహించే సీపీఐ 100వసంతాల ఉత్సవాల సందర్భంగా నిర్వహించే భారీ బహిరంగసభకు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రచారజాత నవంబరు 15న జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రం నుంచి ప్రారంభమైన జాతా 17వ తేదీన నల్లగొండ జిల్లాకు చేరుకుని మునుగోడు, నకిరేకల్, నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ మీదుగా ఖమ్మం చేరుకుంటుందని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు నలపరాజు రామలింగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు ఆర్.అంజాచారి, గురిజ రామచంద్రం, తీర్పాటి వెంకటేశ్వర్లు, నలపరాజు సతీష్‌కుమార్, సూదనబోయిన రమేష్, బీమనపల్లి రమేష్, బుర్ర శేఖర్, సురిగి చలపతి, బి.లాలు, బిక్షంరెడ్డి, బరిగెల వెంకటేశ్, తిప్పర్తి రాములు, పల్లె యాదయ్య పాల్గొన్నారు.

గుట్టలో పాలన ప్రక్షాళనపై
ప్రభుత్వం నజర్

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనంతరం సమీక్ష?
- అధికారుల సెలవులు, విదేశీ పర్యటనలపై ఆరా
- గుట్టలో ఇంటెలిజెన్స్ తనిఖీలు



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ పాలనపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. ఇటీవల దేవస్థానంలోని ఎలక్ట్రికల్ విభాగం ఇన్‌చార్జీ ఎస్ఈ వీవీ.రామారావు ఏసీబీకి చిక్కడంతో పాటు దేవస్థానంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పలు అవకతవకలు వెలుగుచూశాయి. ఈ నేపథ్యంలో దేవస్థానం పరిపాలన విభాగాన్ని ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలిసింది.
- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

తెలంగాణ తిరుపతిగా పేరొందిన యాదగిరిగుట్ట ఆలయానికి అప్రతిష్ట రాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ప్రభుత్వం ఆదేశించినట్టు తెలిసింది. ఆలయ ఈవోతో పాటు డిప్యూటీ ఈవో, పలువురు అధికారులు సెలవుపై వెళ్లడంతో ద్వితీయ శ్రేణి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో పరిపాలనలో మార్పులు, చేర్పులు చేపట్టి, భక్తులు అసౌకర్యానికి గురికాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని యోచిస్తున్నట్టు సమాచారం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులంతా ప్రచారంలో ఉన్నారు. ఈ ఎన్నిక అనంతరం యాదగిరిగుట్ట దేవస్థానంపై సమీక్షా సమావేశాన్ని ఏర్పాటుచేసి, పరిపాలనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనున్నట్టు తెలిసింది. యాదగిరిగుట్ట ఆలయ ఈవోగా ఉన్న ఎస్.వెంకట్రావ్(ఐఏఎస్) ఆగస్టు 30న ఉద్యోగ విరమణ పొందాల్సి ఉండగా, ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని రెండేళ్లు పొడిగించింది. ఆ తర్వాత 10 రోజులు మాత్రమే ఆయన విధులకు హాజరయ్యారు. సెప్టెంబరు 25 నుంచి వ్యక్తిగత సెలవులపై అమెరికా వెళ్లారు. ఆయన స్థానంలో కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు రవినాయక్‌కు ఇన్‌చార్జీ ఈవోగా గత నెల 24న బాధ్యతలు అప్పగించింది. ఆయన కూడా ఉద్యోగరీత్యా శిక్షణ కోసం వెళ్లడంతో దేవాదాయశాఖ కమిషనర్ హరీష్‌కు అదనంగా ఈవోగా బాధ్యతలు అప్పగించింది. కాగా, ఆయన ఇప్పటివరకు ఈవోగా బాధ్యతలు తీసుకోలేదు. రవినాయక్ మంగళవారం ఇన్‌చార్జీ ఈవోగా బాధ్యతలు తీసుకోనున్నట్టు తెలిసింది. గుట్ట లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో వెంకట్రావ్ నెలరోజులకు పైగా వ్యక్తిగత సెలవుపై అమెరికా వెళ్లారు. ఆయన లేనప్పుడు బాధ్యతలు చూడాల్సిన డిప్యూటీ ఈవో లండన్, యూరప్ దేశాల్లో పర్యటిస్తున్నారు. ఆలయంలో పనిచేస్తున్న కీలక అధికారులు ఒకేసారి సెలవుపై వెళ్లడంపై ప్రభుత్వం ఆరా తీసినట్టు సమాచారం. ఇదిలా ఉండగా, దేవస్థానంలో ఇంటెలిజెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు.

వాటర్ ప్లాంట్ యజమానిపై కేసు


పోలీసులు స్వాధీనం చేసుకున్న వివిధ పేర్లతో ఉన్న వాటర్ బాటిళ్లు

చౌటుప్పల్ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా హోటళ్లు, వ్యక్తుల పేర్లతో లేబుళ్లు ముద్రించి వాటర్ బాటిళ్లు విక్రయిస్తున్న వాటర్ ప్లాంట్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపాలిటీ తాళ్ల సింగారంలో తోటకూరి లోకేశ్ ఇండ్ డ్రింకింగ్ వాటర్స్ బాటిళ్లు విక్రయించడానికి లైసెన్స్ పొందాడు. నిబంధనలకు విరుద్ధంగా టీ స్టాల్స్, హోటల్స్, డాబాల పేరిట లేబుళ్లు ముద్రించి వాటర్ బాటిల్స్ హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం వాటర్ ప్లాంట్‌పై దాడులు నిర్వహించారు. వాటర్ బాటిల్స్ తయారీకి ఉపయోగించే లేబుళ్లు టీడీఎస్ మిషన్లు, పీహెచ్‌సీ మిషన్లు, వివిధ రకాల వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. యజమాని లోకేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఆటో.. 8 మందికి గాయాలు

మునగాల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): టైర్ పేలడంతో ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి ఒరిగింది. ఆటోలో ఉన్న కూలీలు కిందపడి ఎనిమిది మంది కూలీలు గాయపడ్డారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలోని కాగితాలరామచంద్రపురం వద్ద సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలంలోని కృష్ణానగర్ గ్రామానికి చెందిన కూలీలు పి. గీత, నూకబత్తిని పద్మ, డి. రమణ, పి. సంధ్య, పి. చైతన్య, పి. స్వప్న, లలిత, నాగమణి మిరప కాయలు ఏరేందుకు కూలి పని కోసం ఆటోలో ఖమ్మం జిల్లాకు వెళ్తున్నారు. ఈ క్రమంలో నడిగూడెం మండలంలోని కాగితాలరామచంద్రపురం వద్దకు రాగానే ఆటో వెనుక టైర్ పేలింది. దీంతో ఆటో రోడ్డు పక్కకు దూసుకెళ్లి ఒరిగింది. దీంతో కూలీలు ఆటోలో నుంచి కిందపడిపోయారు. కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్ నిజాయితీ.. నగదు అప్పగింత


బాధితుడికి నగదు అప్పగిస్తున్న హెడ్‌కానిస్టేబుల్

సూర్యాపేటక్రైం, నవంబరు 3,(ఆంధ్రజ్యోతి): బాధితుడు పోగొట్టుకున్న నగదు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు సూర్యాపేట జిల్లా ఏఆర్ హెడ్ కానిస్టేబుల్. సూర్యాపేట పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద శ్రీసాయి సంతోషి జూయలర్స్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మణిముఖర జూయలర్స్ దుకాణం ప్రారంభోత్సవానికి సినీ నటి అనసూర్యను ఆహ్వానించారు. సదరు నటి రావడంతో ప్రజలు వందల సంఖ్యలో దుకాణం వద్దకు చేరుకున్నారు. మోతె మండలం బుర్కచర్ల గ్రామానికి చెందిన కొండా చిరంజీవి కూడా వెళ్లాడు. అంతకు ముందు తన ఎక్స్‌కవేటర్‌కు చెల్లించాల్సిన ఈఎంఐ కోసం తన భార్య నగలు తాకట్టు పెట్టి లక్షన్నర నగదు తీసుకున్నాడు. డబ్బులు పాయింటు జేబులో పెట్టుకుని జూయలర్స్ దుకాణం ప్రారంభోత్సవం వద్దకు వెళ్లాడు. ప్రజలు ఎక్కువగా రావడంతో పోలీసులు పరిస్థితిని అదుపుచేసే క్రమంలో కొంతమేర తోపులాట జరిగింది. ఆ సమయంలో చిరంజీవి జేబులో ఉన్న లక్షన్నర నగదు కిందపడింది. కార్యక్రమం అనంతరం చిరంజీవికి తన ప్యాంట్ జేబులో పెట్టుకున్న డబ్బులు కన్పించలేదు. ఆందోళనకు గురైన చిరంజీవి తన నగదు పోయిందని పోలీసులకు చెప్పాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ లింగయ్యకు నగదుతో కూడిన కవర్ లభించింది. వెంటనే నిజాయితీతో పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అక్కడ నగదును అప్పగించాడు. పట్టణ పోలీసులు బాధితుడు చిరంజీవిని పిలిపించి పోయిన నగదు తాలూకు వివరాలు సేకరించి నగదును హెడ్ హెడ్‌కానిస్టేబుల్ లింగయ్య ద్వారా బాధితుడు చిరంజీవికి అప్పగించారు. నిజాయతీ చాటుకున్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ లింగయ్యను పోలీసులు, ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీరాములు, సంజీవరావు ఉన్నారు.

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ


చౌటుప్పల్ హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల బారులు

చౌటుప్పల్ టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం వాహనాల రద్దీ నెలకొంది. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే రోడ్డు వాహనాలతో కిక్కిరిసి పోయింది. వర్షం కూడా ప్రారంభం కావడంలో వాహనాల స్పీడ్ తగ్గి నెమ్మదిగా ముందుకు కదిలాయి. ట్రాఫిక్ పోలీసులు వర్షంలో తడుస్తూ వాహనాలను నియంత్రించారు.

వాయిదాలకు హాజరుకాని నిందితులకు జైలు

తిరుమలగిరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు నిందితులను జడ్జి జైలుకు పంపించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన వేల్పుగొండ చిన్న ఎల్లయ్య, మునిసిపాలిటీ కేంద్రానికి చెందిన పర్వతగిరి రాజు కొంతకాలంగా కోర్టుకు హాజరుకావడం లేదు. పోలీసులు సోమవారం నిందితులను అదుపులోకి తీసుకొని తుంగతుర్తి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి గౌస్‌పాషా నాయిన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళకు గాయాలు

వలిగొండ, నవంబరు 3,(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై మహిళకు గాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని అరూరు మదిర గ్రామం గంగాపురంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన దేశపాక అండాలు తన వ్యవసాయ బావి వద్ద పనులు చేస్తుండగా చెట్టుకు తలిగిలిన విద్యుత్ వైరును చూసుకోకుండా తగలడంతో విద్యుదాఘాతానికి గురైంది. గాయపడిన అండాలును కుటుంబ సభ్యులు భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లో ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

గన్యానాయక్‌తండాలో మూడు మేకపోతులు..

కొండమల్లేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజోతి): విద్యుదాఘాతంతో మూడు మేకపోతులు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని గన్యానాయక్‌తండాలో సోమవారం జరిగింది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గన్యానాయక్ తండాకు చెందిన రమావత్ హీరా లాలునాయక్ ఆదివారం కొండమల్లేపల్లి పశువుల సంతలో తొమ్మిది మేకపోతులను కొనుగోలు చేసి తండాకు తీసుకెళ్లాడు. సోమవారం ఉదయం వాటిని మేపడానికి తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. అయితే ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి చెట్టు కూలి కరెంట్ తీగల మీద పడటంతో విద్యుత్ తీగలు తెగి కింద పడిపోవడంతో మేతకు వెళ్లిన మేకపోతులకు కరెంట్ తీగలు తగలడంతో విద్యుదాఘాతంతో మేకపోతులు అక్కడికక్కడే మృతిచెందాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ..


రాంమూర్తి మృతదేహం

చివ్వెంల నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చివ్వెల మండలంలోని ఉండ్రుగొండ ఆర్బీ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ మహేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఉండ్రుగొండ గ్రామానికి చెందిన పర్వతం రాంమూర్తి(45) ఆదివారం రాత్రి సమయంలో కార్పెంటర్ పనినిమిత్తం సూర్యాపేటకు వెళ్లి ఉండ్రుగొండ ఆర్బీ సమీపంలోకి రాగానే సూర్యాపేట నుంచి విజయవాడకు వెళ్తున్న కారు రాంమూర్తి బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. రాంమూర్తి భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రీయింబర్స్‌మెంట్ కోసం పోరుబాట

● ఉమ్మడి జిల్లాకు రూ.400 కోట్ల బకాయి ● 83 కళాశాలల మూతతో 40వేల మంది విద్యార్థులపై ప్రభావం ● కళాశాలల బంద్ సంపూర్ణం



మిర్యాలగూడలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

నల్లగొండ, భువనగిరి టౌన్, మిర్యాలగూడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ విద్యా సంస్థలు బంద్‌ను పాటించాయి. తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ మెనెజ్‌మెంట్ అసోసియేషన్(టీపీడీపీఎంఏ) ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలతో సహా వృత్తి విద్యా కళాశాలలు, బీఈడీ కళాశాలలు బంద్ అయ్యాయి. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో మొత్తం 83 కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో మొత్తం 40వేలకు పైగా విద్యార్థులు వివిధ కోర్సులను అభ్యసిస్తున్నారు. 2021-22 విద్యా సంవత్సరం నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఈ కళాశాలలకు సుమారు రూ.400 కోట్ల వరకు రీయింబర్స్ రావాల్సి ఉంది. దసరా పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని కళాశాలలకు కేవలం రూ.300కోట్లు మాత్రమే విడుదల చేయగా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రూ.4కోట్ల నుంచి రూ.5కోట్ల వరకు మాత్రమే వచ్చినట్లు తెలుస్తోంది.

40వేల మంది విద్యార్థులపై ప్రభావం

ప్రైవేట్ విద్యా సంస్థలు బంద్ పాటించడంతో వివిధ కోర్సులు అభ్యసిస్తున్న 40వేల మంది విద్యార్థులపై ప్రభావం పడుతుంది. రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ప్రైవేట్ కళాశాలల యజమాన్యాలు రెండు నెలలుగా ప్రభుత్వాన్ని కోరడంతో పాటు పలు విడతలుగా చర్చలు కూడా జరిపాయి. దసరా పండుగ సందర్భంగా రూ.300కోట్లు మాత్రమే విడుదల చేయగా అంగీకారం మేరకు మరో రూ.900కోట్లు విడుదల చేయాలని ఆయా సంఘాలు ప్రభుత్వాన్ని కోరినా ప్రభుత్వం నుంచి సానుకూలంగా స్పందన లేకపోవడంతో ప్రైవేట్ కళాశాల యజమాన్యాలు మరొకసారి ప్రభుత్వానికి నోటీసు ఇచ్చింది. రాష్ట్రస్థాయిలో ప్రైవేట్ కళాశాలల యజమాన్య సంఘాల సమాఖ్య(ఫాతీ) రీయింబర్స్‌మెంట్ కోసం పోరాటం చేస్తుంది. ఇటీవల ప్రభుత్వం మరో రూ.150కోట్లు విడుదల చేస్తామని చెప్పినా కళాశాల యజమాన్య సంఘాలు అందుకు అంగీకరించలేదు. ప్రభుత్వం సమ్మె విరమించాలని విజ్ఞప్తి చేసినా పూర్తి స్థాయిలో బకాయి విడుదల చేయాలని అంగీకారం మేరకు మరో రూ.900కోట్లు ఇవ్వాలని కోరింది. ప్రభు త్వం ఇచ్చిన హామీ మేరకు బకాయిలు విడుదల చేయకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె చేస్తున్నామని ఆయా సంఘాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వంతో మున్ముందు చర్చలు జరిపినా బకాయిలు ఇచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని యజమాన్యాలు పేర్కొంటున్నాయి. సమ్మె నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరీక్షలను కూడా వాయిదా వేసే పరిస్థితి ఏర్పడుతుంది. పలు కళాశాలల్లో ప్రథమ సంవత్సరంతో పాటు రెండో సెమిస్టర్ పరీక్షలు, అదేవిధంగా డీఈడీ, బీఈడీ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. పరీక్షలు వాయిదా వేసే పరిస్థితి ఏర్పడింది. పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇంటర్నల్ పరీక్షలను వాయిదా వేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా పలు ప్రైవేట్ విద్యా సంస్థల బంద్‌తో విద్యార్థులు చదువుపై ప్రభావం చూపనుంది. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో విద్యారంగానికి ఒక శాతం నిధులు మాత్రమే ఖర్చు చేస్తున్నారని కళాశాల యజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికే పలు బ్యాచ్‌లు విద్యను పూర్తిచేసుకొని వెళ్లారని, వారికి సంబంధించిన రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం చెల్లించకున్నా సర్టిఫికెట్లు అన్నింటిని అందజేశామని కళాశాల యజమాన్యాలు పేర్కొంటున్నాయి.

రీయింబర్స్‌మెంట్ వచ్చే వరకు బంద్ పాటిస్తాం



ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు మంగళవారం నాడు మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. రియంబర్స్‌మెంట్ వచ్చే వరకు దశల వారీగా ఆందోళన కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుడదని కళాశాల యజమాన్యాలు ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా నాలుగు సంవత్సరాలుగా రీయింబర్స్‌మెంట్ ఇవ్వకున్నా అప్పులు చేసి కళాశాలు నడిపించాం. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వెంటనే ఉమ్మడి జిల్లాకు రావాల్సిన రియంబర్స్‌మెంట్ చెల్లించాలి.

టీ. శ్రీనివాస్‌రెడ్డి, టీపీడీపీఎంఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

నిధులు విడుదల చేసి ఆదుకోవాలి



నాలుగేళ్లుగా ఫీజు బకాయిలు విడుదల కాక అప్పులు తెచ్చి కళాశాల నిర్వహించాల్సి వస్తోంది. బోధన సిబ్బందికి నెలనెలా వేతనాల చెల్లింపు కళాశాల నిర్వహణ తలకు మించిన భారంగా మారింది. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అప్పులతో నెట్టుకొస్తున్నాం. ప్రభుత్వం విద్యార్థుల ఖాతాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ చే యాలని ఆలోచిస్తుంది. అందువల్ల ప్రభుత్వ ధనం దుర్వినియోగం అయ్యేఅవకాశం ఎక్కువ. కళాశాలల ఫీజు ఎగవేతకు ప్రయత్నిస్తారు.

తెడ్ల ధనుంజయ, విజేత కళాశాల ప్రిన్సిపాల్

కళాశాల విద్యార్థుల నిరసన

మిర్యాలగూడ డివిజన్‌లో ఆరు డిగ్రీ కళాశాలలు, ఐదు జూనియర్ కళాశాలలు, నర్సింగ్ 3, బిఈడి కళాశాలలు 2, పారామెడికల్ 5, ఒక ఇంజనీరింగ్ ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. సుమారు 3వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు సమాచారం. ప్రభుత్వం స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో వేతనాలు చెల్లించలేక, తరగతులు బోధించడం కష్టంగా మారిందని గత్యంతరం లేని పరిస్థితిల్లో సోమవారం నుం చి కళాశాలలను మూసివేస్తున్నట్లు విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలు సమాచారం ఇచ్చారు. దీంతో పలు విద్యాసంస్థల్లోని విద్యార్థులు ఫీజు బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతూ ప్లకార్డులు, ఫ్లెక్సీలతో నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు విద్యార్థులతో ధర్నా నిర్వహించారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుకుంటోందని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం గతంలో ప్రకటించినట్లుగా ఫీజు బకాయిలను విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. మంగళవారం నుంచి ప్రారంభం కావాల్సిన ఫార్మసి రెండవ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలంటూ యాజమాన్యాలు మూడు రోజుల క్రితమే జేఎన్టీయూ వైస్ చాన్సలర్‌కు లేఖ రాశారు. అయితే ఈ నెల 13నుంచి ప్రారంభం కావాల్సిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలపై సందిగ్ధత నెలకొంది. ఈ దిశగా ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా కళాశాలల వద్ద విద్యార్థులు ధర్నా నిర్వహించారు.

ఆర్థిక సమస్యలతో సీఆర్‌పీ ఆత్మహత్య


రణపంగు రమేష్(ఫైల్)

హుజూర్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలతో సీఆర్‌పీ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండల పరిధిలోని లక్కవరం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన సీఆర్‌పీ రణపంగు రమేష్(41) ఎంఈవో కార్యాలయంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ)గా పనిచేస్తున్నారు. ఆర్థిక సమస్యలతో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమేష్ మృతి బాధాకరమని ఎంఈవో సైదానాయక్, కాంప్లెక్స్ హెచ్ఎంలు బీరెల్లి శ్రీనివాసరెడ్డి, పెనుగొండ శ్రీనివాసు, నలబోలు శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయన మృతి పట్ల సీఆర్‌పీలు సైదులు, బ్రహ్మం, ఐఈఆర్‌పీలు శ్రీనివాస్, కుక్కడపు గోవింద్, తాతరాజు శ్రీనివాసరావు, నర్సిరెడ్డి, జహరేఅలమ్, జయరాజు, పలు పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

దశదినకర్మకు రావాలని ఫోన్ చేసి..


యల్లారెడ్డి (ఫైల్)

వలిగొండ, నవంబరు 3, (ఆంధ్రజ్యోతి): క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని గొల్లెపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ యుగేందర్‌గౌడ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గొల్లెపల్లి గ్రామానికి చెందిన మంగళారపు మల్లారెడ్డి(52) వ్యవసాయదారుడు. ఆదివారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. తన బావ ఐల నర్సిరెడ్డికి ఫోన్ చేసి తాను విషం తాగి చనిపోతున్నానని సమాచారం చేరవేశాడు. దీంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం గోకారం గ్రామపరిధిలో మృతదేహం కన్పించింది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మల్లారెడ్డి బావ నర్సిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా మల్లారెడ్డి భార్య ఐదు సంవత్సరాల క్రితం చనిపోయింది. ఆయనకు అవివాహి తులైన ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. తండ్రి కూడా ఈ మధ్యనే చనిపోయాడు. అతని దశదినకర్మ సోమవారం జరగాల్సి ఉండగా బంధువులం దరికీ దశదిన కర్మకు రావాలని ఫోన్ చేసినట్లు తెలిసింది.

సీఐ చంద్రబాబుకు జాతీయ పురస్కారం



భువనగిరి రూరల్, నవంబరు 3(ఆంధ్ర జ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భువనగిరి రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న నగరి చంద్రబాబు ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపికయ్యారు. తెలంగాణ ఇంటెలిజెన్స్‌తో పాటు అదే విభాగంలో అంతర్భాగమైన కేసుల పరిశోధనలో ప్రతిభ కనబరిచినందుకు కేంద్రీయ గృహ మంత్రి దక్షిత పతక్ పురస్కారానికి ఎంపికయ్యారు. కాగా రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, డీసీపీ అక్షాంశ్‌యాదవ్, ఏసీపీ రాహుల్‌రెడ్డిలతో పాటు తదితర ప్రజా సంఘాల ప్రతినిధులు ఆయనను అభినందించారు.

చికిత్సపొందుతూ..

తిప్పర్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ మహిళ మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ వి. శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఇండ్లూరు గ్రామానికి చెందిన జక్కల లక్ష్మమ్మ అదే గ్రామానికి చెందిన మరికొంత మందితో కలిసి ఆటోలో వెంకటాద్రిపాలెం గ్రామానికి పత్తికూలి పనుల నిమిత్తం వెళ్లి ఆదివారం సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్తుండగా వెంకట్రాపాలెం గ్రామం సమీపంలోకి రాగానే ఆటో డ్రైవర్ కుర్ర వెంకన్న నిర్లక్ష్యంగా అతివేగంగా నడిపించడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జక్కల లక్ష్మమ్మతో పాటు అండాలు, అలివేలు, మేరమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన లక్ష్మమ్మను నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు మృతిచెందింది.

అనుమానంతోనే భార్యను చంపేశాడు

● వివాహిత హత్య కేసు వివరాలు వెల్లడించిన పోలీసులు

కట్టంగూరు, నవంబరు 3, (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని పరడ గ్రామంలో ఈనెల 1వ తేదీన జరిగిన వివా హిత హత్య కేసును పోలీసులు చేధించారు. కట్టంగూరు పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి కేసుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ రవీందర్‌తో కలిసి వివరాలను సీఐ కొండల్‌రెడ్డి వెల్లడించారు. పరడ గ్రామానికి చెందిన పరడ మహేష్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ గతంలో మహిళను ప్రేమ వివాహం చేసుకున్నాడు. నిత్యం వేధింపులకు గురిచేస్తుండడంతో ఆమె విడాకులు తీసుకొని అనంతరం ఆత్మహత్యకు పాల్పడింది. గత ఏడాది డిసెంబరులో యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ గ్రామానికి చెందిన సుమలత(30)తో వివాహం జరిగింది. కొన్నాళ్ల పాటు వీరి కాపురం సవ్యంగా సాగింది. కొన్ని నెలలుగా మహేష్ రోజు మద్యం సేవించి వచ్చి భార్యను వేధించేవాడు. కొన్ని రోజుల నుంచి భార్యపై అనుమానం పెంచుకొని వేధింపులు తీవ్రతరం చేశాడు. ఈ క్రమంలో గత నెల 31వ తేదీ రాత్రి భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. అదే రోజు రాత్రి భార్యను తీవ్రంగా కొట్టిన మహేష్ అదే రోజు తెల్లవారుజామున(నవంబరు1) మూడు గంటల సమయంలో ఆమెను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. ఆమె మెడలు విరిచి, తీవ్రంగా కొట్టి చీరతో ఉరివేసి ఆత్మహ త్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించాడు. భార్య చనిపోయిందని నిర్ధారిం చుకున్న తరువాత బంధువులకు ఫోన్ చేసి సుమలతను చంపి వేశానని వచ్చి చూసుకోవాలని చెప్పి పరారయ్యాడు. ఈ ఘటనపై మృతురాలి తల్లి వేముల మారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శాలిగౌరారం రూరల్ సీఐ కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి భార్యను హత మార్చిన మహేష్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి.. నీటిగుంతలో పడి


రోదిస్తున్న అయాన్ కుటుంబసభ్యులు, అయాన్ (ఫైల్)

బాలుడి మృతితో కాసనగోడు గ్రామంలో ఉద్రిక్తత

కేతేపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రంలో ఉండాల్సిన బాలుడు అనుమానాస్పద స్థితిలో నీటిగుంతలో పడి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కాసనగోడు గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఒకటో నెంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో సరిపోను పిల్లలు లేకపోవడంతో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను రెండో నెంబరు కేంద్రంలో ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. సోమవారం ఏడుగురు పిల్లలు వచ్చారు. గ్రామానికి చెందిన కుంచం జగదీష్, శ్రావణి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు అయాన్(4)ను కొద్దిరోజులుగా అంగన్‌వాడీ కేంద్రానికి పంపిస్తున్నారు. సోమవారం తల్లి శ్రావణి అయాన్‌ను అంగన్‌వాడీ కేంద్రంలో వదిలి ఇంటికి వెళ్లింది. మధ్యాహ్నం బహిర్భూమికి వెళ్లాలని అయాన్ అంగన్‌వాడీ ఆయాకు చెప్పాడు. దీంతో ఆయా అయాన్‌ను అంగన్‌వాడీ కేంద్రానికి దాదాపు 300మీటర్ల దూరంలో ఉన్న ఓ పెద్ద నీటిగుంత వద్దకు తీసుకెళ్లింది. బహిర్భూమి అనంతరం అయాన్ కడుక్కునేందుకు నీటిగుంట అంచుల్లోకి వెళ్లాడు. పట్టుతప్పిన నీటిగుంతలో పడి పోయాడు. అయాన్‌ను కాపాడేందుకు ఆయా చేసిన యత్నాలు ఫలించక ఆందోళనతో కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు అక్కడికి వచ్చారు. ఇద్దరు యువకులు నీటిగుంతలోకి దిగి అయాన్‌ను వెతికి బయటకు తీశారు. అప్పటికే బాలుడు ఊపిరాడక మృతిచెందాడు. అయాన్ తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు అంగన్‌వాడీ కేంద్రం వద్దకు చేరి ఆందోళనకు దిగారు. పిల్లలను కాపాడడంలో నిర్లక్ష్యమెందుకని సిబ్బందిని దూషించారు. సిబ్బంది నిర్లక్ష్యంతో బాలుడు మృతిచెందాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంగన్‌వాడీలో మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉన్నా కార్యకర్తలు, ఆయాలు, తనిఖీలకు వచ్చే అధికారులు వాటిని వాడుకుంటారు కానీ ఏనాడూ వాటిని పిల్లలకు వినియోగించలేదని ఆరోపించారు. గ్రామస్థుల ఆగ్రహం చూసి భయాందోళనలతో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కేంద్రంలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సతీష్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆందోళకారులతో మాట్లాడి అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న నలుగురు సిబ్బందిని పోలీసుల రక్షణ మధ్య స్టేషన్‌కు తరలించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించేందుకు చేసిన యత్నాలు సోమవారం రాత్రి పొద్దుపోయే వరకూ ఫలించలేదు. మృతదేహాన్ని అంగన్‌వాడీ కార్యకర్త ఇంటి ముందు ఉంచి ఆం దోళన చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది. రాత్రి 7గంటలకు మృతదేహాన్ని అంగన్‌వాడీ కార్యకర్త ఇంటి ముందు ఉంచి ఆందోళనకు దిగారు. రాత్రిపొద్దు పోయే వరకు ఆందోళన కొనసాగుతునే ఉంది.

బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు : కలెక్టర్

కాసనగోడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన బాలుడు కుంచం అయాన్ మృతి బాధాకరమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సోమవారం రాత్రి కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం వెలుపల మృతిచెందినప్పటికీ ఆ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని ఆమె పేర్కొన్నారు.

కీలక అడుగు

(5వ పేజీ తరువాయి)

తవ్వాల్సి ఉంది. రెండోవైపు మన్నేవారిపల్లి నుంచి (నీరువిడుదలయ్యే వైపు) చేపట్టిన అవుట్‌లెట్ టన్నెల్ 23.980 కిలోమీటర్లకు 20.435 కిలోమీటర్లు పూర్తవగా, ఇంకా 3.545 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. 2019 నుంచి ఊటనీరు వచ్చిచేరుతుండడంతో పాటు, పనులు చేస్తున్నప్పుడు మట్టి, రాళ్లు కూలుతుండడంతో పనులకు బ్రేక్‌పడింది. ఈ ప్రాజెక్టు మొదలైనప్పటినుంచి 2014 వరకు సుమారు 30కిలోమీటర్ల సొరంగం తవ్వితే, 2014 నుంచి 2024 వరకు పదేళ్ల కాలంలో కేవలం 4కిలోమీటర్లే తవ్వారు. మొదటి టన్నెల్‌లో ఇంకా 9.560కిలోమీటర్ల సొరంగమార్గం తవ్వాల్సి ఉంది. ఈ పనులకోసమే టీబీఎం టెక్నాలజీని పక్కనబెట్టి, అత్యాధునిక విధానంలో, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పనులు చేయిస్తామని సీఎం, మంత్రులు పేర్కొంటున్నారు. తాజాగా, నిర్వహిస్తున్న సర్వేను వీలైనంత వేగంగా పూర్తిచేయించి, సర్వే నివేదికల ఆధారంగా సొరంగాన్ని ప్రతీ 250మీటర్లకు ఒక యూనిట్‌గా తీసుకొని ఎక్కడ ఎలా కొనసాగించాలో నిర్ణయిస్తారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుగా నియమించిన ఆర్మీ జనరల్ హర్పాల్‌సింగ్, ఆర్మీ నుంచి డిప్యూటేషన్‌పై తీసుకొచ్చిన టన్నెల్ స్పెషలిస్ట్ పరీక్షిత్ మెహ్రా సూచనలమేరకు డిజైన్లు రూపొందించి పనులు పునరుద్ధరించనున్నారు.

డిసెంబర్ 31లోగా నిర్వాసితులకు పరిహారం, పునరావాసం

ఎస్ఎల్‌బీసీ పనుల కారణంగా నిర్వాసితులు అవుతున్న చందంపేట మండలంలోని నక్కలగండి తండా, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని కేశ్యతండా, మర్లపాడుతండాల వాసులకు వచ్చే 31 డిసెంబర్ నాటికి పూర్తిస్థాయిలో పరిహారం అందించడంతో పాటు, పునారావాసం కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం హామీ ఇచ్చారు. దేవరకొండ, అచ్చంపేట ఎమ్మెల్యేలు బాలూనాయక్, వంశీకృష్ణ విజ్ఞప్తి మేరకు ఈ మేరకు ప్రకటన చేశారు. 2015-16లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే ప్రకారం ఈ మూడుతండాల్లో 629 గిరిజన కుటుంబాలు నిర్వాసితులు అవుతుండడంతో వారికి పునరావాసం కల్పించాలని నిర్ణయించారు. జిల్లాలో ముంపు ప్రాంతమైన నక్కలగండితండాకు సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ కాలనీని నిర్మించేందుకు చింతపల్లి మండలం నసర్లపల్లి వద్ద 10 ఎకరాల భూమిని పరిశీలించారు. ఇక్కడ ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ నిర్మించాలని నిర్ణయించినా ఇంకా ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదు. అటు నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కేశ్యతండా, మర్లపాడుతండాలకు సంబంధించి పునరావాస కేంద్రాన్ని తొలుత సిద్ధాపురం వద్ద ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయిస్తే, అందుకు నిర్వాసితులు అంగీకరించలేదు. దీంతో ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు సమీపంలో ఆర్‌అండ్‌ఆర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది.

బస్సులు లేక అగచాట్లు





భూదాన్‌పోచంపల్లిలో ప్రమాదకరంగా ఫుట్‌బోర్డుపై ప్రయాణం చేస్తున్న విద్యార్థులు, ప్రజలు (ఫైల్)

- ప్రమాదకరంగా ఫుట్‌బోర్డు ప్రయాణం
- భూదాన్‌పోచంపల్లికి సబ్ అర్బన్ బస్సులు నడిపించాలని వినతి

(ఆంధ్రజ్యోతి- భూదాన్‌పోచంపల్లి) : యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణానికి దశాబ్ద కాలంగా ఆర్టీసీ బస్సులు సరిపోను లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న భూదాన్‌పోచంపల్లికి సబ్ అర్బన్ బస్సులు లేవు. భూదాన్‌పోచంపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు తగినన్ని బస్సులు లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. పర్యాటక కేంద్రం కావడంతో భూదాన్‌పోచంపల్లికి ప్రతి నిత్యం పర్యాటకులు, దేశ విదేశీయులు సందర్శిస్తుంటారు. ఉన్నత చదువుల కోసం విద్యార్థులతోపాటు ఉద్యోగ, వ్యాపారాల కోసం నిత్యం 500 మందికి పైగా ప్రయాణికులు హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్, కోఠి, కొత్తపేట తదితర ప్రాంతాలకు వెళ్తుంటారు. కాలేజీ, ఆఫీసులకు వెళ్లే సమయాలకు ఉదయం 7-45 నుంచి 8-15 గంటలకు వచ్చే బస్సు ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసిపోతుంటుంది. బస్సుల్లో స్థలం లేక అమ్మాయిలు సైతం ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఉదయం 8 గంటల సమయంలో ఒకేఒక్క బస్సు ఉండడంతో విద్యార్థులతో బస్సు కిక్కిరిసిపోతోంది. కళాశాల, వాణిజ్య, వ్యాపార సంస్థలకు సకాలంలో చేరుకోవడానికి బస్సులు ఒంటికాలుపై వేలాడుతూ నిలబడి ప్రయాణిస్తూ నరకయాతన పడుతున్నారు. ఈ విషయంపై పలుసార్లు విద్యార్థులు ధర్నాలు, రాస్తారోకోలు చేసిన మార్పు రాలేదు. గతంలో మెట్రో డీలక్స్ బస్సులు రెండు వచ్చేవని, రాత్రి వేళలో ఉన్న బస్సులే తొలగించారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు, ఈ ప్రాంత ప్రజాప్రతినిధులకు పలుసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి కూడా వినతి పత్రాలు అందజేశారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి విద్యార్థులకు, ప్రజలకు సరిపడా బస్సు సౌకర్యం కల్పించాలని మండల ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి



భూదాన్‌పోచంపల్లి పట్టణానికి వెంటనే బస్సుల సంఖ్యను పెంచాలి. సబ్ అర్బన్ బస్సులు నడిపించేందుకు చర్యలు తీసుకోవాలి. ఈ విషయంపై ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి శనివారం వినతి పత్రాన్ని అందజేశా. ఆయన వెంటనే స్పందించి సంబంధిత డిపో మేనేజర్‌కు లేఖ రాశారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

- కుమారస్వామి,కాంగ్రెస్ నాయకుడు,పోచంపల్లి

పాఠశాల బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం

● బురదలో కూరుకుపోయిన వెనుక టైర్లు



బురదలో కూరుకుపోయిన బస్సు

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాల బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ప్రమాదవశాత్తు బురదలో ఇరుక్కొని ఒకవైపు ఒరిగింది. సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని అగ్రి గోల్డ్‌కాలనీలో ఈ ఘటన జరిగింది. మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను ఎక్కించుకునేందుకు కాలనీకి వెళ్లింది. అక్కడ నుంచి అద్దంకి-నార్కట్‌పల్లి హైవే మీదకు వచ్చేందుకు ఖాళీ ప్రదేశంలో మలుపుతున్న క్రమంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి బురదమట్టిలో బస్సు వెనుక టైర్లు బురదలో కూరుకపోయి ఓ వైపు ఒరిగింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులు భయాందోళనకు గురై కేకలు వేయడంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. బస్సులో ఉన్న సుమారు 45మంది విద్యార్థులను కాలనీవాసులు సాయంతో సురక్షితంగా బయటపడ్డారు. బస్సు డ్రైవర్ ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా పెనుప్రమాదం సంభవించి విద్యార్థులు తీవ్రంగా గాయపడేవారని కాలనీవాసులు తెలిపారు. విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం అక్కడకు చేరుకొని బస్సును పరిశీలించిన అనంతరం విద్యార్థులను ఆటోల్లో పాఠశాలకు తరలించారు. బస్సు ప్రమాదం నుంచి విద్యార్థులంతా సురక్షితంగా బయటపడడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

కనుల పండువగా మత్స్యగిరీశుడి కల్యాణం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులు

వలిగొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలో మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి కల్యాణం వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా సోమవారం నిర్వహించారు. ముక్కోటి దేవతలు ఆహుతులుగా లోక కల్యాణార్థం సకల సంపదల నెలవైన లక్ష్మీ అమ్మవారి మెడలో శుభఘడియల్లో మంగళ్యధారణ గావించారు. లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న కల్యాణం విష్వక్సేనుడి తొలి పూజలతో ఆరంభించారు. కల్యాణ మహోత్సవం వెంకటరమణాచార్యుల యాజ్ఞీకములో దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీ ప్ర తాపురం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ వేడుక నిర్వహించారు. వేద పండితులు జయరామశాస్త్రి, శాంతి కుమార శర్మ, యాదగిరిస్వామి, హరికృష్ణ అనంతాచార్యులు సాయి, అర్చక బృందం వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీ హరికి పట్టు పీతాంబరాలు మంగళసూత్రం, ముత్యాల తలంబ్రాలను ఆలయ పాలక మండలి చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్‌కుమార్ రెడ్డి దంపతులు అందజేశారు. కల్యాణం అనంతరం ఎదుర్కోళ్ల మహోత్సవం వేద మంత్రోచ్చరణలతో జరిపారు. స్వామివారి కల్యాణ వేడుకలను తిలకించడానికి వచ్చిన భక్తులకు చిన్నకొండూరు వాస్తవ్యులు నర్సిరెడ్డి, జైపాల్‌రెడ్డి-రమాదేవి దంపతుల వారి సౌజన్యంతో అన్న వితరణ చేశారు.



పూజల్లో పాల్గొన్న భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

లక్ష్మీనరసింహస్వామి వారిని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ భీమానాయక్, తహసీల్దార్ దశరథ దర్శించుకుని పూజలు చేశారు. మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు, దేవస్థాన దర్మకర్తలు కొడితాల కరుణాకర్, అరూరి వెంకటేష్, రేఖల ప్రభాకర్ గౌడ్, బండి రవికుమార్, గుండు జగన్మోహన్‌రెడ్డి, అంబాల ఊశయ్య, ఈతాప రాములు, జక్కుల కేతమ్మ, మైసోళ్ళ వెంకటేశం, కొమిరె బాలేశ్వర్, కందుల శ్రీను, స్థానిక ప్రజా ప్రతినిదులు, గ్రామ పెద్దలు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ గుట్టపైన నూతనంగా నిర్మించిన ఘాట్ రోడ్డు రేలింగ్‌ను ఎంపీ కిరణ్‌కుమారెడ్డి ప్రారంభించారు.

నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లు మూసివేత

● 589.30 అడుగుల వద్ద సాగర్ నీటిమట్టం



మూసివేసిన నాగార్జునసాగర్ గేట్లు

నాగార్జునసాగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లను సోమవారం ఉదయం మూసివేశారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో గత నెల 30వ తేదీన సాగర్‌కు ఎగువ నుంచి భారీ వరద రావడంతో సాగర్ 20 క్రస్ట్ గేట్లను ఎత్తి ప్రాజెక్టు అధికారులు నీటి విడుదల చేశారు. వరద రాకను బట్టి గేట్ల సంఖ్యను తగ్గిస్తూ సోమవారం ఉదయం పూర్తిగా మూసివేశారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 589.30 అడుగులుగా (309.9534టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,292 క్యూసెక్కులు, కుడికాల్వ ద్వారా 8,023 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 41,915 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతుండగా ఎగువ నుంచి 41,915 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.

మూసీకి తగ్గిన ఇన్‌ఫ్లో

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి ఇన్ ఫ్లో క్రమంగా తగ్గుతూ వస్తుంది. ఎగువన వర్షాలు తగ్గినా ఆయా ప్రాంత చెరువులు, కుంటల అలుగు పోస్తుడడంతో మూసీ రిజర్వాయర్‌కు వరద నీటిరాక కొనసాగింది. సోమవారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 4,927.28 క్యూసెక్కులుగానమోదైంది. మరోవైపు ప్రాజెక్టు 645 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలో ఉండడంతో ప్రాజెక్టు అధికారులు ఎగు వ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోను వచ్చింది వచ్చినట్లు ప్రాజెక్టు 2,4,8 నెంబరు క్రస్ట్ గేట్లను 2 అడుగుల మేర ఎత్తి 4861.77 క్యూసెక్కుల నీటిని దిగువ మూ సీకి విడుదల చేస్తున్నారు.645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 644.70 అడుగులు(4.12టీఎంసీలు) వద్ద నిలకడగా కొనసాగుతుంది.

పులిచింతల ప్రాజెక్టు గేట్లు..

చింతలపాలెం : పులిచింతల ప్రాజెక్టు క్రస్టు గేట్లను అధికారులు సోమవారం మూసివేశారు. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 35, 365 వేల క్యూసెక్కులు కాగా అవుట్ ఫ్లో 17 వేల క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తి నీటినిల్వ సామర్థ్యం 175 అడుగులు(45.77 టీఎంసీలు)గా ఉండగా ప్రస్తుతం 173.095 అడుగులు (42.8661)గా టీఎంసీలు నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు ఎడమ గుట్టును ఉన్న తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుచి 16,600 క్యూసెక్కుల నీటి విడుదలతో జలవిద్యుత్ తయారవుతున్నటట్లు ఎస్సీ దేశ్యనాయక్ తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టడం నాగార్జునసాగర్ గేట్లు మూసివేయడంతో పులిచింతలకు వరద ప్రవాహం తగ్గడంతో క్రస్టు గేట్లు మూసివేసినట్లు పేర్కొన్నారు.

సాగర్‌లో నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి

● 7వ యూనిట్ ద్వారా వందరోజుల పాటు ఉత్పత్తి

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో 7వ యూనిట్ ద్వారా వంద రోజుల పాటు నిరంతరాయంగా విద్యుదుత్పత్తి కొనసాగుతోందని జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ సోమవారం తెలిపారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో 100 మెగావాట్ల సామర్థ్యం గల ఎనిమిది టర్బైన్లు ఉన్నాయని, అందులో 7వ టర్బైన్ వంద రోజులుగా ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ ఉత్పత్తి చేయడంతో 240మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయినట్లు వివరించారు. మిగిలిన 7 టర్బైన్‌లో వందరోజుల్లో మధ్య మధ్యలో నిలిపామని 7వ టర్బైన్ మాత్రం ఒక్కరోజు కూడా ఆపలేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఇంజనీర్లు, ఉద్యోగులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఈలు రఘురాం, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు చేరుకుంటున్న విద్యార్థులు



పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

దేవరకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలోకి వ ర్షం నీరు తగ్గడంతో సోమవారం విద్యార్థులు పాఠశాలకు చేరుకుంటున్నారు. ఇటీవల కురిసిన తుఫాన్‌కు గురుకుల పాఠశాల ఆవరణలోకి వర్షపునీరు చేరడంతో విద్యార్థులను పెంచికల్‌పహడ్ బీసీ గురుకుల పాఠశాలకు తరలించగా, మరికొందరు విద్యార్థులను తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. అయితే వర్షాలు తగ్గడం, గురుకుల పాఠశాల ఆవరణలో వరద ఉధృతి తగ్గిపోవడంతో కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాఠశాలకు రావాలని విద్యార్థులకు సూచించడంతో విద్యార్థులు పాఠశాలకు చేరుకుంటున్నారు. పాఠశాలలో 540 మంది విద్యార్థులు ఉండగా సోమవారం సాయంత్రానికి 250 మందికిపైగా విద్యార్థులు పాఠశాలకు హాజరైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్ ఆదేశాలమేరకు అధికారులు జేసీబీతో పాఠశాల చుట్టూ నీరు నిలువకుండా చర్యలు చేపడుతున్నారు.

అక్రమ నిర్మాణమంటూ ఇంటిని కూల్చివేశారని..

● పెట్రోల్ డబ్బాతో రోడ్డుపై బాధిత కుటుంబం రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బాధిత కుటుంబం, గ్రామస్థులు

మోత్కూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులోని కాశవారి గూడెంలో తన ఇంటిని అక్రమ నిర్మాణమంటూ కూల్చివేశారని సోమవారం సాయంత్రం కాశవారి కాలనీ వద్ద మోత్కూరు- తిరుమలగిరి రోడ్డుపై పెట్రోలు డబ్బా పట్టుకుని బాధిత కుటుంబం రాస్తారోకో చేసింది. బాధిత కుటుంబానికి కాలనీ వాసులు అండగా నిలిచారు. బాధితులు, కాలనీ వాసులు తెలిపిన వివరాల ప్రకారం... కాశవారిగూడేనికి చెందిన ఎండీ.ఫక్కీరు అహ్మద్ సర్వేనంబరు 402లోని ప్రభుత్వ భూమిలో 242 చదరపు గజాల స్థలంలో ముందుగా గుడిసె వేసుకుని ఆ తర్వాత దశల వారీగా ఇల్లు నిర్మించుకున్నాడు. 2020లో ఆ స్థలం తనదని, తనకు ప్రభుత్వం క్రీడాకారుడి కోటాలో ఇచ్చిందని అడ్డగూడూరు మండలం కోటమర్తి గ్రామానికి చెందిన బెల్లె నగేష్ రెవెన్యూ, మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు గాని సోమవారం రెవెన్యూ, మునిసిపల్ అధికారులు వచ్చి తన ఇంటిని కూల్చివేశారని బాధితుడు అహ్మద్ తెలిపారు. తనకు చావే శరణ్యమంటూ పెట్రోలు డబ్బాతో కాలనీ వాసులతో కలిసి మోత్కూరు-తిరుమలగిరి రోడ్డుపై రాస్తారోకో చేశారు. క్రీడాకారుడు నగేష్‌కు క్రీడాకారుల కోటాలో భువనగిరి పట్టణంలో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇచ్చారని అహ్మద్ ఆరోపించారు. రెండు చోట్ల ఎలా ఇస్తారని ఆయన ప్ర శ్నించారు. రాస్తారోకోతో రోడ్డుపై భారీసంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు సర్దిచెప్పి రాస్తారోకో విరమింప జేశారు. ఈ విషయమై మునిసిపల్ కమిషనర్ కె.సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా అది ప్రభుత్వ స్థలమన్నారు. ఇటు అహ్మద్, నగేష్‌కు గాని ప్రభుత్వం పట్టా ఇవ్వలేదన్నారు. అది ప్రభుత్వ స్థలమని తేలడంతో అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ, మునిసిపల్, పోలీసు శాఖలో ఆధ్వర్యంలో తొలగించామన్నారు,జ ఆ స్థలం ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందన్నారు.

శివకేశవులకు విశేష పూజలు



శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామి అమ్మవారికి పాంచరాత్రాగమరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విష్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండీ జోడుసేవలు, సహస్రనామార్చనలు కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్పటిక మూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులను అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయా ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ29,93,269 ఆదాయం సమకూరినట్లు దేవాదాయ శాఖ డైరెక్టర్, ఇన్‌చార్జీ ఈవో ఎస్. హరీష్ తెలిపారు. కాగా, కొండకింద వ్రత మండపాల్లో సత్యదేవుని వ్రతాలు 750 జంటలు వ్రతాలు నిర్వహించినట్లు పర్యవేక్షకుడు దొమ్మాట సురేందర్ రెడ్డి తెలిపారు.

కొబ్బరికాయల దుకాణాలకు ధరల పట్టిక

లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిధిలో వర్తకులు అధికధరలకు కొబ్బరికాయలు విక్రయిస్తుండడంతో అధికారులు చర్యలు చేపట్టారు. దేవస్థాన పరిధిలోని సోమవారం కొబ్బరికాయ కేవలం రూ.40లకే విక్రయించే విధంగా దుకాణ సముదాయాలకు పోస్టర్‌ను అతికించారు. అందుకు భిన్నంగా వ్యవహరించిన వర్తకులపై టెండరు రద్దు చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఆలయ ఇన్‌చార్జీ డీఈవో (ఏఈవో) జూశెట్టి కృష్ణ ముందుగా కొబ్బరికాయల దుకాణాల పరిశీలించి చర్యలు చేపట్టారు.

కార్తీక దీపారాధనలో కలెక్టర్ దంపతులు

కార్తీకమాసం సోమవారం సందర్భంగా శివాలయంలో వైభవంగా నిర్వహించిన దీపారాధనలో కలెక్టర్ హనుమంతురావు దంపతులు పాల్గొని దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


రేపు ఆకాశ దీపారాధన

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి విశేష పర్వదినం సందర్భంగా అన్నకూటోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో హరీష్ తెలిపారు. అదేవిధంగా స్వామివారి నిత్య కల్యాణం అనంతరం మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు గోష్టి గర్భాలయ శుద్ధి చేసి ఉభయ దర్శనాలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. సాయంత్రం 6.30 గంటలకు ఆస్థాన మండపంలో ధ్వజస్థంభం వద్ద పూజా కార్యక్ర మాలు నిర్వహించి ఆకాశ దీపారాధన చేయనున్నట్లు వివరించారు.



దీపారాధనలో పాల్గొన్న యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు దంపతులు

డాక్టర్ పుల్లారావుకు బెస్ట్ కమ్యూనిటీ పురస్కారం



డాక్టర్ పుల్లారావుకు అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

నల్లగొండ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : సామాజిక కార్యక్రమాలు నిర్వహించిన నల్లగొండ పట్టణానికి ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ పుల్లారావుకు బెస్ట్ కమ్యూనిటీ సర్వీసెస్ అవార్డు అభించింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర సదస్సులో ఎమ్మెల్యే సత్యనారాయణ, ఎస్‌యూడీఏ చైర్మన్ కోమటిరెడ్డి సురేందర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సతీమణి డాక్టర్ అనిత సహకారంలోనే పుల్లారావు ఈఏడాది 227 నేత్రాలను సేకరించారు. 450 మందికి చూపు ఇవ్వడం, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్యశిబిరాల ఏర్పాటు, కంటి చికిత్సలు, ఆపరేషన్లు నిర్వహించారు. కార్యక్రమంలో ఐ ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారకనాథ్‌రెడ్డి, కార్యదర్శి అశోక్, కోశాధికారి దయాల్‌సింగ్, అడ్వైజర్ రవీందర్ రెడ్డి, కాళీ ప్రసాద్, డాక్టర్స్ సం పత్‌రావు, లింగమూర్తి, ప్రమీల, సంధ్యారాణి, సందీప్, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు. జిల్లాకు చెందిన డాక్టర్లు గోపాల్‌రావు, మాధవ్, వెంకటరమణ, వసంతరావు, దేవి, సునంద, వరలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

శాలిగౌరారం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను, నిర్వాసితులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి మాట్లాడుతూ తుఫాను నష్టాన్ని అంచనా వేయడానికి ఏర్పాటు చేసిన బృందాలు యుద్ధ ప్రాతిపదికన అంచనా వేసి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నారు. తేమ శాతంతో సంబంధం లేకుండా మార్కెట్‌కు వచ్చిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిలువేరు జానయ్య, శంకర్, మామిడోజు వెంకటేశ్వర్లు, నర్సయ్య, పిట్టల అనిల్, సత్తిరెడ్డి, పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలని ..

కనగల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతూ నల్లగొండ జిల్లా కనగల్ మండలం దోరెపల్లి స్టేజీ వద్ద ప్రధాన రహదారిపై సోమవారం రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా కన్వీనర్ గోలి జగాల్‌రెడ్డి మాట్లాడుతూ రైస్‌మిల్లర్లు ధాన్యం దిగుమతిలో ఆలస్యం చేయడమే కాకుండా తేమ, తాలూ పేరుతో కోతలు విధిస్తున్నారని మండిపడ్డారు. తేమతో సంబంధం లేకుండా వడ్ల కాంటా వేయాలన్నారు. తడిసిన ప్రతి గింజా కొనుగోలు చేయాలన్నారు. విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసులు, దోరెపల్లి రైస్‌మిల్లు యజమాని ధర్నా వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడి ఆందోళనను విరమింప చేశారు.

చెర్వుగట్టు క్షేత్రానికి కార్తీక శోభ



సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న దంపతులు

నార్కట్‌పల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) కార్తీక మాసంతో పాటు సోమవారం కూడా కావడంతో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో చెర్వుగట్టు క్షేత్రానికి కార్తీక శోభ సంతరించుకుంది. జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సొంత వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో తరలివచ్చారు. సుప్రభాత సేవ నుంచే స్వామివారిని దర్శించుకుంటూ పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, బిల్వ పత్రాలతో అర్చనలో పాల్గొన్నారు. వ్రత మండపంలో సామూహిక సత్యదేవుడి వ్రతాలు ఆచరించారు. దర్శనం అనంతరం గుట్టపైన గుట్ట కింద పార్వతీ అమ్మవారి ఆలయ ప్రాంగణం, స్వామివారి పాదాలు, పాదరక్షల పూజ వద్ద భక్తులు కార్తీకదీపాలు వెలిగించారు. భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. సర్వదర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం చేసుకునే భక్తులు కొద్దిగా ఇబ్బంది పడ్డారు. ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సతీష్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ పూజాధికాలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుం డా దేవస్థాన సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

ఘాట్ రోడ్డుపై ట్రాఫిక్ సమస్య

ఘాట్‌రోడ్డుపై యథావిధిగా ట్రాఫిక్ సమస్యతో భక్తులు ఇక్క ట్లు ఎదుర్కొంటున్నారు. నియంత్రించే వారు లేకపోవడంతో వాహనాలలపైకి చేరుకుని ఘాట్ రోడ్డుపై ఇష్టానుసారం గా పార్కింగ్ చేస్తుండడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంగాసదన్ వెనుక భా గంలో సంప్ పక్కనే ఉన్న ఓ వృక్షం వర్షం ధాటికి సోమవారం తెల్లవారుజామున ఘాట్ రో డ్డుపై కూలిపోవడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో దేవస్థాన సిబ్బంది భక్తుల సాయంతో తొలగించడంతో రాకపోకలు కొనసాగాయి.

విద్యార్థులకు కంటి పరీక్షలు

కట్టంగూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూర్ కింగ్స్ ఆధ్వర్యంలో సూర్యాపేట లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రి సహకారంతో మండలంలోని పామనగుండ్ల, దుగినవెల్లి, ఐటిపాముల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజన్ టెక్నీషియన్ స్వాతి 200 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ఆరుగురు విద్యార్థులకు దృష్టి లోపం గుర్తించారు. వారికి కంటి అద్దాలు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

సీఐటీయు మర్రిగూడ మండల కన్వీనర్‌గా ఏర్పుల పద్మ



మర్రిగూడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ మండల కన్వీనర్‌గా ఏర్పుల పద్మను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీ నారాయణ ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పుల పద్మ మాట్లాడుతూ మండలంలో కార్మికవర్గ సమస్యలపై ఉద్యమిస్తామని అన్నారు. సీఐటీయూ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు ఏర్పుల యాదయ్య, భాగ్యమ్మ, వసంత పాల్గొన్నారు.

రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్, నరసింహ

మర్రిగూడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మర్రిగూడ తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్, శివన్నగూడ రైతు సేవా సంఘం చైర్మన్ బాలం నరసింహ అన్నారు. సోమవారం మండలంలోని శివన్నగూడ రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో శివన్నగూడ, కుదాభక్షపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చేటప్పుడు ధాన్యాన్ని తుర్పారపట్టి తాళ్ల లేకుండా తేమశాతం వచ్చేంత వరకు ఎండబెట్టుకొని తీసుకొని రావాలని సూచించారు. శివన్నగూడెంలో దొడ్డు ధాన్యాన్ని కుదాభక్షపల్లి కేంద్రంలో సన్న ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 500 రూపాయలు బోనస్ వస్తుందని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో మల్లేష్, సీఈవో మధు, రవీందర్‌రెడ్డి, రాములునాయక్, ఉత్తరయ్య, మల్లయ్య, సొసైటీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంఘాల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

కేతేపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సంఘాల నిర్వహణలో మహిళలు తగిన జాగ్రత్తలు పాటించాలని కేతేపల్లి ఎంపీడీవో బి.శ్రీనివాసరావు సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం మండల సమాఖ్య సభ్యులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య సభ్యులు, సంఘాల బాధ్యులు సంఘాల సమావేశాల నిర్వహణ, పొదుపు, అప్పుల వసూళ్లు, బ్యాంకు రుణాలు ఇప్పించడం, చిన్న తరహా దుకాణాల నిర్వహణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వలిశెట్టి మల్లేష్, సెర్ప్ సీనియర్ సీఆర్పీలు సూరమ్మ, నిర్మల, సమాఖ్య అధ్యక్షురాలు రాధిక పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను బలోపేతం చేయాలి



దాతలను సన్మానిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో అస్రాఅంజుమ్

శాలిగౌరారం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని ఐసీడీసీ సీడీపీవో అస్రా అంజుమ్ అన్నారు. మండలంలోని వంగమర్తి గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు గ్రామానికి చెందిన మాచర్ల భాస్కర్ 30 కుర్చీలు, మాజీ సర్పంచ్ సకినాల వరలక్ష్మినర్సయ్య 30 పలకలు, గ్రామానికి చెందిన చిలుకూరి వాసుదేవరావు,శంకర్‌రావు పెద్ద కుర్చీలు, రూపని కృష్ణ 10 పలకలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దాతలను సీడీపీవో ఘనంగా సన్మానించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో లింగ వివక్షత, లింగ నిర్ధారణ, అక్రమ దత్తతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, పోషన్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ ప్రేమ్‌సాగర్, అంగన్‌వాడీ టీచర్లు అమృతమ్మ, పద్మావతి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



డిగ్రీ చదివేదెట్లా?

- డిగ్రీ కళాశాల లేక విద్యార్థుల ఇబ్బందులు
- చదువుకు దూరమవుతున్న పేద విద్యార్థులు
- కళాశాలను ఏర్పాటు చేయాలని వినతి



డిగ్రీ కాలేజీ కొరకు నాంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాలు (ఫైల్)

నాంపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి మం డలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో గ్రా మీణ ప్రాంత విద్యార్థులు విద్యకు దూరమవుతున్నా రు. మండలంలో 32 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అదే విధంగా మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియ ర్ కళాశాల, మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు మొదటి, రెండవ సంవత్సరం కలుపుకొ ని 515 మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. ఈ కళాశాలల్లో మండలానికి చెందిన విద్యార్థులు మాత్రమే కాకుండా మర్రిగూడ, గుర్రంపోడు మండలాలకు చెందిన విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. ఇంటర్ పూర్తయిన తర్వాత డిగ్రీ లేదా ఉన్నత చదువుల కోసం వేరే ప్రాంతానికి వెళ్లాల్సి వస్తుంది. డిగ్రీ చదువు కోవాలంటే విద్యార్థులు దేవరకొండ, నల్లగొండ, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే విద్యార్థులు పేద వారు కావడంతో వారి తల్లిదండ్రు లు పెద్దగా చదువు కోకపోవడం విద్యార్థులను దూర ప్రాంతాలకు పంపడానికి ఆసక్తి చూపడం లేదు. ఒకవేళ పంపించిన అక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీటు రాకపోవడం, ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులు కట్టలేక, ప్రభుత్వ హాస్టల్‌లో సీటు లభించకపోతే అధిక ఫీజులు చెల్లించలేక అర్ధాంతరంగా మధ్యలో చదువు లు ఆగిపోతున్నాయి.

ఒకవేళ నాంపల్లి నుంచి నల్లగొండ, దేవరకొండ ఇతర ప్రాంతాలకు రోజు ఇంటికి వచ్చి పోయి చదువుకుందామనుకుంటే మండల కేంద్రంనుంచి బస్సు సౌకర్యాలు అంతంత మాత్రమే. మండలంలో ఎన్నోగ్రామాలకు బస్సు సౌకర్యం కూడా లేదు. నాంపల్లికి వచ్చి చదువుకునే విద్యార్థులు వాళ్ల గ్రామాల నుంచి బస్సులు లేకపోవడంతో ఆటోలో కళాశాలకు, పాఠశాలకు వస్తున్నారు. మండల విద్యార్థులు డిగ్రీ విద్యకు దగ్గర చేయాలంటే ప్రభుత్వ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి.

విద్యకు దూరంగా అమ్మాయిలు

నాంపల్లిలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో అమ్మాయిలు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. చదువుకోని తల్లిదండ్రులు, కూలీ పనులు మీద ఆధారపడే వారు ఒంటరిగా ఎలా చదువుకుంటుందోననే భయంతో దూర ప్రాంతాలకు పంపడం లేదు. దగ్గరలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఇంటర్ పూర్తి కాగానే పొలం పనులకు, చిన్న వయస్సులోనే వివాహాలు చేస్తున్నారు.

డిగ్రీ కళాశాల చేయాలి



ఇంటర్ సెకండ్ ఇయర్ పూర్తయింది. డిగ్రీ చదువుకోవాలంటే నల్లగొండ, హైదరాబాద్‌కి వెళ్లాల్సిన పరిస్థితి. దేవరకొండకు వెళ్లాలంటే బస్సులు సమయానికి ఉండవు. నాంపల్లిలో డిగ్రీ కాలేజీ ఉంటే చదువుకునేందుకు ఇబ్బందులు తొలుగుతాయి. వెంటనే నాంపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి.

\- మెందికార్ సంతోష్, నాంపల్లి

అమ్మాయిలు విద్యకు దూరమయ్యే అవకాశం



మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో అమ్మాయిలు ఉన్నత విద్యకు దూరమయ్యే అవకాశం ఉంది. నాంపల్లిలో కాలేజీకి పోవాలంటేనే బస్సులు లేకపోవడంతో ఆటో ఎక్కి పోతున్నాం. బస్సులు లేకపోవడం, నాంపల్లిలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో తల్లిండ్రులు దూరం పంపించి చదివించాలంటే భయపడుతున్నారు. అంతేకాక ఆర్థిక ఇబ్బందుల కారణంగా సుముఖత చూపడం లేదు. ప్రభుత్వం స్పందించి బస్సు సౌకర్యంతో పాటు డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలి.

\- పాచ్చిపాల శివాని, మల్లపురాజుపల్లి

విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి



నాంపల్లి మండలంలో ఉన్న మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా పాఠశాలలో ప్రతీ సంవత్సరం 200 నుంచి 300 మంది విద్యార్థులు ఇంటర్ పూర్తి చేస్తున్నారు. ఆ తర్వాత ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. కొన్నేళ్లుగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతున్నాం. ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో మాట ఇచ్చి ఆ తర్వాత నెరవేర్చడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలి.

\- సతీష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు, నాంపల్లి

రామలింగేశ్వరునికి లక్ష పుష్పార్చన



నార్కట్‌పల్లి శివాలయంలో లక్షపుష్పార్చన వేడుకలో పాల్గొన్న భక్తులు

నార్కట్‌పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో భాగంగా నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం లక్ష పుష్పార్చన వేడుకను ఘనంగా నిర్వహించారు. భక్తుడు గంపా నాగభూష ణం కవిత దంపతులు పూలదాతలుగా నిర్వహించిన ఈ పూజార్చనను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ఆలయ అనువంశిక అర్చకుడు నిడిగొండ భగవాన్ శర్మ ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు పుష్పాలను అందజేశారు. ఈ వేడుకలో దేవాలయం చైర్మన్ పుల్లెంల శ్రీనివాస్, చల్లా వాసుదేవ్, బూర్గు జనార్దన్, రాంబాబు, యాద సునీత, జెరిపోతుల పద్మ, కర్నాటి రమాదేవి, వడ్డేగోని నాగమణి, తెల్సూరి సత్తమ్మ, మేడబోయిన మంగ తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో కార్తీకమాసం సోమవారం సందర్భంగా శివాలయల్లో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. మండలంలోని ఇనుపాముల పచ్చలపార్వతీ సోమేశ్వరాలయం, కేతేపల్లి శ్రీశంభులింగేశ్వరాలయం, తుంగతుర్తి, భీమారం, కాసనగోడు గ్రామాల్లోని శివాలయాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా శివాలయాల్లో నిర్వహించిన కార్తీకమాస సోమవారం పూజల్లో అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇనుపాముల శివాలయానికి స్థానికులతో పాటు నకిరేకల్ పట్టణం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.

రేపటి నుంచి సీతారామాంజనేయ ఆలయ ఉత్సవాలు



దశమ వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బండారు ప్రసాద్

నల్లగొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప ట్టణంలోని వివేకానంద నగర్‌లో గల శ్రీసీతారామాంజనేయ దేవాలయం దశమ వార్షికోత్స వాన్ని ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బండారు ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆల య ఆవరణలో దశమ వార్షికోత్సవ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 5న గణపతిపూజ, పుణ్యాహవచనం, గోపూజ, మూల మంత్ర, 6వ తేదీన 108 కళాశాలతో ఉత్సవ మూర్తులకు స్నాపనం, హోమం, సుదర్శన హోమం, సహస్ర తులసీఅర్చన, బిల్వార్చన, రుద్రహోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 7వ తేదీన దత్త మూల మంత్రహోమం, సీతారామ స్వామి శాంతికల్యాణం జరుగుతుందని భక్తులు అధికసంఖ్య హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు అక్కినపల్లి విద్యాసాగర్, మాజీ కౌన్సిలర్ బొజ్జ నాగరాజు, పున్నపు రాజు, యాదగిరి, నక్క నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

శాలిగౌరారం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని జై భీమ్ ఆర్మీ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, శాలిగౌరారం సింగిల్ విండో డైరెక్టర్ పనికర కృష్ణ కోరారు. శాలిగౌరారంలో విలేకరులతో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ. 900 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గడచిన 22 నెలల నుంఇ రాష్ట్రంలోని విద్యాసంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు పై చదువులకు వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం వెంటనే కాలేజీ యజమాన్యాలకు బకాయిలు చెల్లించి విద్యార్థుల జీవితాలను కాపాడాలని విద్యాశాఖకు వెంటనే మంత్రిని నియమించి విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బాలికల విద్యతోనే అసమానతలు దూరం



కనగల్ : దర్వేశిపురం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న శ్రీలత

మునుగోడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉన్నతంగా రాణించాలంటే కేవలం విద్యతోనే సాధ్యమని మునుగోడు ఏసీడీపీవో దేప వెంకటమ్మ అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యా ప్రముఖ్యతపై విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో మూఢవిశ్వాసాలతో జరిగే బాల్య వివాహాలను అరికట్టేందుకు తమ వంతు బాధ్యతగా అందరూ కృషి చేయాలన్నారు. కేజీబీవీ ప్రత్యేకాధికారిణి పుష్పలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష పాల్గొన్నారు.

ఆడపిల్లను రక్షిద్దాం..

మర్రిగూడ : దామెర భీమనపల్లి, నామాపురం అంగన్వాడీ కేంద్రాలలో జడ్పీహెచ్ఎస్ దామెర భీమనపల్లిలో బేటి బచావో - బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తల్లులు పిల్లలు, జడ్పీహెచ్ఎస్ స్కూల్ ఉపాధ్యాయులు, ఆడపిల్లను రక్షిద్దాం, చదివిద్దాం, 18 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేద్దాం అనే ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోద, శ్రీలత, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం లచ్చిరాం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు..

లింగ నిర్ధారణ చట్టవిరుద్ధం

కనగల్ : లింగనిర్ధారణ పరీక్షలు చేయించడం చట్టరీత్య నేరమని సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. దర్వేశిపురంలోని 12వ అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అరుణ, జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కనగల్, నవంబరు 3,(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమరవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం మండలంలోని ఎస్‌లింగోటం గ్రామశివారులో పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ట్రాక్టర్లను సీజ్ చేసి సంబంధిత డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ ఇసుకఅక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు.

బైపాస్‌కు లింకు రోడ్లు కలపాలి



కలెక్టర్‌త్రిపాఠికి వినతిపత్రం అందజేస్తున్న సత్యనారాయణ

నల్లగొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 19వ వార్డులో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లను అద్దంకి బైపాస్ రోడ్డుకు లింకు ఇవ్వాలని మాజీ కౌన్సిలర్ కొండూరు సత్యనారాయణ కోరుతూ కలెక్టర్ ఇలా త్రిపాఠికి సోమవారం వినతిపత్రం అందజేశారు. శ్రీనగర్, ఆదిత్య, ఎన్‌జీవో కాలనీల్లో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లను బైపాస్ వెళ్లే విధంగా రోడ్లను కలపాలని పేర్కొన్నారు. సిమెంట్ రోడ్ల నిర్మాణాలు లేక బురద గుంటలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సైదులు, కోటప్ప, వెంకన్న, దశరథ, శ్రీను తదితరులు ఉన్నారు.

అవుట్ సోర్సింగ్ నియామకాలపై విచారణ చేయాలి



కలెక్టర్‌త్రిపాఠికివినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో అ వుట్ సోర్సింగ్ పోస్టుల నియామకాలపై విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి సోమవారం కారింగ్ శ్రీనివాస్‌గౌడ్, శ్రీను, ముచ్చర్ల శ్రీనివాస్ గౌడ్, మేడి వినోద్ కుమార్ వినతి పత్రం అందజేశారు. మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆ పోస్టులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకం చేయడానికి నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. 12మంది అర్హులం దరఖాస్తు చేసుకున్నామని, వీరిలో ఒక్కొక్కరికి 7 నుంచి 10 ఏళ్ల అనుభవం ఉన్నప్పటికీ తమకు అనుకూలమైన వ్యక్తులను ఆయా పోస్టుల్లో భర్తీ చేశారని పేర్కొ న్నారు. వెంటనే విచారణ చేసి నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

'అవినీతికి వ్యతిరేకంగా పోరాడేది ఎర్రజెండా మాత్రమే'



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

తిప్పర్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : దోపిడీ దౌర్జన్యాలు, అవినీతికి వ్యతిరేకంగా పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రగడ్డలగూడేనికి చెందిన గండమల్ల శంకరయ్య సంతాప సభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. పజ్జూరు, వెంకటాద్రిపాలెం గ్రామాల్లో పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేసిన మనిషి గండమల్ల శంకరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి, మాజీ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, పాలడుగు నాగార్జున, హాశం, నన్నూరి వెంకటరమణారెడ్డి, ఎండి సలీం, నర్సిరెడ్డి, పాల్గొన్నారు.

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.30 (309.9534)	41,915	41,915
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.70 (4.12)	4,927.28	4,927.28
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.8661)	35,365	17,000

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.250

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పెండింగ్ పనులను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించి రెండేళ్ల లో పూర్తిచేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 22న ఇన్‌లెట్‌లో పనుల ప్రదేశంలో టన్నెల్ కుప్పకూలి ఎనిమిది మంది కార్మికులు మృతి చెందడంతో పనులు నిలిచాయి. టన్నెల్‌లో ఇకపై ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తవ్వకం పూర్తిచేసేందుకు చేపట్టిన హెలిబోర్న్ ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వేను సోమవారం సొరంగమార్గం అవుట్‌లెట్‌వైపున నాగర్‌కర్నూల్ జిల్లా మన్నెవారిపల్లి వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు.
- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)


సీఎం, మంత్రులకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల్లో
కీలక అడుగు

- హెలిబోర్న్ ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వే ప్రారంభం
- అవుట్‌లెట్ వద్ద ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి
- ఆర్మీ సహకారంతో ఆధునిక సాంకేతికత
- రెండేళ్లలో పనుల పూర్తికి హామీ
- ప్రమాదరహితంగా, పర్యావరణ హితంగా పనులు సాగిస్తామని ప్రకటన
- నిర్వాసితులకు డిసెంబరు నెలాఖరునాటికి పునరావాసం కల్పిస్తామని భరోసా



హెలిబోర్న్ ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వేలో సొరంగమార్గంలో ప్రతీ 250 మీటర్ల భూభాగంలో 1,000మీటర్ల లోతువరకు ఎలాంటి రాతిశిలలు న్నాయి? జలవనరులున్నాయి? ఇతర నిర్మాణా లు ఏమున్నాయనే అంశాలను గుర్తించి వాటికి అనుగుణంగా తవ్వకాలను చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించనుంది. ఈ సర్వే ను వీలైనంత వేగంగా పూర్తిచేసి సొరంగమార్గంలో పెండింగ్ ఉన్న సుమారు 9.800 కిలోమీటర్ల తవ్వకాన్ని వచ్చే రెండేళ్లలో పూర్తిచేయించి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3లక్షల ఎకరాలకు సాగునీరు,30లక్షల జనాభాకు తాగునీ రు అందిస్తామని సీఎం,మంత్రులు ప్రకటించారు.

అటవీభూమి బదలాయింపూ పెండింగ్‌లోనే



ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులో భాగంగా తెల్దేవర్‌పల్లి వద్ద నిర్మిస్తున్న నక్కలగండి రిజర్వాయర్‌లో (డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ఫారెస్ట్‌కు చెందిన 281.93 హెక్టార్ల భూమి ముంపునకు గురవుతోంది. ఈ భూములను ప్రాజెక్టుకు కేటాయించేందుకు కేంద్ర అటవీ శాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. అందుకోసం ఇప్పటికే కేంద్ర అటవీశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారిక సంప్రదింపులు పూర్తయినా, ముందడుగు పడలేదు. ఈ భూమిని కేంద్రం కేటాయిస్తే, దీనికి బదులుగా రిజర్వ్‌ఫారెస్ట్ ఆవల ఇతర ప్రాంతాల్లో 790 హెక్టార్లలో అడవిని అభివృద్ధి చేసి ఇచ్చేందుకూ రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధతను వ్యక్తం చేసింది. కీలకమైన ఈ అనుమతులు వస్తేనే నక్కలగండి రిజర్వాయర్ అందుబాటులోకి వస్తుంది. ప్రాజెక్టు పనులతో పాటు ఈ అటవీ భూమి బదలాయింపు అంశంపైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాల్సి ఉంది.

ఆర్మీ సహకారంతో..

ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గాన్ని రిజర్వ్‌ఫారెస్ట్ లో తవ్వుతుండగా, 2005లో ఈ ప్రాజెక్టు చేపట్టినప్పుడు అప్పట్లో దేశంలో ఎక్కడాలేని రీతిలో టన్నెల్ బోరింగ్ యంత్రం ద్వారా పనులు ప్రా రంభించారు. కీలకమైన టన్నెల్-1 నిర్మాణాన్ని రెండువైపుల నుంచి చేపట్టారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకునే ప్రాంతం నుంచి చేపట్టిన ఇన్‌లెట్ టన్నెల్ 19.500 కిలోమీటర్లకు ఇప్పటివరకు 13.935 కిలోమీటర్లు పూర్తికాగా, ఇంకా 6.015 కిలోమీటర్ల సొరంగం...

- మిగతా 6వ పేజీలో...

ఎస్ఎల్‌బీసీని పూర్తిచేయడమే లక్ష్యం
- ఎమ్మెల్యే బాలునాయక్



దేవరకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్ని అడ్డంకులు ఎదురైనా అధిగమించి శ్రీశై లం సొరంగమార్గాన్ని పూర్తిచేసి నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్-1 ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వే ప్రారంభానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలి సి ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, ఈప్రాజెక్టును పూర్తిచేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారన్నారు. భద్రత, నాణ్యత విషయంలో రాజీపడకుండా పనులు నిర్వహించి ప్రపంచస్థాయి ఇంజనీరింగ్ ప్రాజెక్టుగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్-1 రికార్డుస్థాయిలో నమోదవుతుందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేవరకొండ, అచ్చంపేట నియోజకవర్గాలకు పూర్తిస్థాయిలో సాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందన్నారు. ఈ సందర్భంగా సీఎం, మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ప్రైవేట్ కళాశాలల యజమానులు

రీయింబర్స్‌మెంట్ కోసం
పోరుబాట

- ఉమ్మడి జిల్లాకు రూ.400 కోట్ల బకాయి
- కళాశాలల మూతతో 40వేల మంది విద్యార్థులపై ప్రభావం
- కళాశాలల బంద్ సంపూర్ణం

నల్లగొండ, మిర్యాలగూడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ప్రైవేట్ కళాశాలల యజమానులు, విద్యార్థులు పోరుబాటపట్టారు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ విద్యా సంస్థలు బంద్‌ను పాటించాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 83 కళాశాలలు ఉండగా, వివిధ కోర్సుల్లో మొత్తం 40వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 2021-22 విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వం సుమారు రూ.400 కోట్ల మేర రీయింబర్స్ చెల్లించాల్సి ఉంది. అయితే దసరా సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని కళాశాలలకు కేవలం రూ.300కోట్లు మాత్రమే విడుదల చేయగా, ఉమ్మడి జిల్లాకు రూ.4కోట్ల నుంచి రూ.5కోట్ల వరకు మాత్రమే వచ్చినట్లు తెలుస్తోంది. కాగా కళాశాలల బంద్‌తో 40వేల మంది విద్యార్థుల చదువులపై ప్రభావం పడనుంది. 6

సాగర్ గేట్ల మూసివేత
7

ప్రమాదాల నివారణకోసం
భారీ హోర్డింగ్
- ఎస్పీ శరత్‌చంద్రపవార్


చిట్యాల మండలం వెలిమినేడు వద్ద హోర్డింగ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

చిట్యాలరూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా నివారణ, అవగాహన కల్పించేందుకు రహదారి పక్కన భారీ ఫ్లెక్సీతో కూడిన హోర్డింగ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడు శివారులో జాతీయ రహదారి పక్కన ట్రాఫిక్‌పై అవగాహనలో భాగంగా జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులకు ప్రమాదాల నివారణకోసం ఏర్పాటు చేస్తున్న భారీ హోర్డింగ్‌ను ఎస్పీ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 65వ నంబరు రహదారిపై నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయని, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వెలిమినేడు శివారులో రహదారి పక్కన భారీ హోర్డింగ్ ఏర్పాటు చేసి, దానిపై పెద్ద ఫ్లెక్సీని కట్టి ప్రమాదానికి గురైన వాహనాల చిత్రాలను ముద్రించి ప్రమాదాలు జరగకుండా అవగాహన కల్పించనున్నామన్నారు. ప్రతీ ఒక్కరి ప్రాణాలు ఎంతో విలువైనవని, జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. ఎస్పీ వెంట నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, నార్కట్‌పల్లి సీఐ కైగూరి నాగరాజు, నల్లగొండ ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య ఉన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు
- కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశం

మర్రిగూడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులను ఇబ్బంది పెట్టకుండా పత్తి మిల్లు యాజమాన్యం 14శాతంమ్యాచర్ వచ్చిన పత్తిని కొనుగోలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం మండలంలోని ఎరగండ్లపల్లి గ్రామ సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహ ఆగ్రో పత్తి మిల్లును సందర్శించి తనిఖీ చేశారు. పత్తి మిల్లులకు తీసుకొచ్చిన పత్తి రైతులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ వల్ల పత్తి తడిసిముద్దయిందని, దీంతో తీవ్రంగా నష్టపోయామని, పత్తి తడిసిందని మిల్లు యజమాన్యం ఎలాంటి షరతులు కొర్రీలు పెట్టకుండా పత్తిని కొనుగోలు చేసే విధంగా చూడాలని, రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. పత్తికొనుగోలులో రైతులకు ఎలాంటి షరతులతో కూడిన కొర్రీలు పెట్టవద్దని మిల్లు యాజమాన్యానికి సూచించారు. పత్తి విక్రయాలకోసం ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న రైతులు పత్తి మిల్లులో కొనుగోలు ఆలస్యం అయితే తిరిగి మరుసటి రోజు ఆన్‌లైన్ బుక్ చేసుకోవాలని రైతులకు సూచించారు. అదేవిధంగా పత్తి విక్రయాల కోసం ఇతర జిల్లాల నుంచి వచ్చిన రైతులకు ప్రాధాన్యత ఇవ్వకుండా, పత్తి కొనుగోలు విషయంలో మర్రిగూడ మండలానికి చెందిన రైతులకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని యజమాన్యాన్ని ఆదేశించారు. ఈమె వెంట ఆర్డీవో శ్రీదేవి, మర్రిగూడ తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాస్, మండల స్పెషల్ అధికారి వేణుగోపాల చారి, ఎంపీడీవో మునయ్య పలువురు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తేమ పాటిస్తేనే పత్తికి మద్దతు ధర: కలెక్టర్

మునుగోడు : ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం తేమ శాతం నిబంధనలు పాటిస్తేనే రైతులు పండించిన పత్తికి మద్దతు ధర లభిస్తుందని లభిస్తోందని జిల్లా కలెక్టర్ అన్నారు. మునుగోడు సలాసర్ బాలాజీ పత్తి జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం శీతాకాలం మంచు కురువడంతో పాటు వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ఉదయం సమయంలో కాకుండా ఎండ వచ్చిన సమయంలో మాత్రమే పత్తి తీయటం పనులు చేయాలన్నారు. కలెక్టర్ వెంట చండూరు ఆర్డీవో శ్రీదేవి, మునుగోడు తహసీల్దార్ నరేష్ నేలపట్ల, ఎస్సై ఇరుగు రవి, సీసీఐ బయ్యర్ బాలాజీ నింజీ, రైతులు తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్

నల్లగొండ : ప్రజావాణిఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. సోమవారం మొత్తం ఫిర్యాదులు 90 రాగా, జిల్లా అధికారులకు 41, రెవెన్యూ శాఖకు 49 వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, గృహ నిర్మాణ పీడీ రాజ్ కుమార్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, నల్లగొండ ఆర్డీవో .వై అశోక్ రెడ్డి ,చండూర్ ఆర్డీవో శ్రీదేవి, అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులును స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులపై దృష్టి సారించి త్వరతగతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. సమావేశానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, ఇన్‌చార్జి డీఆర్‌వో వై. అశోక్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవోలు హాజరయ్యారు.

వివరాలు సక్రమంగా నమోదు చేయాలి

తిప్పర్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : జనగణన కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న సర్వేను సక్రమంగా నిర్వహించాలని జనగణన విభాగ స్టేట్ డైరెక్టర్ భారతి హోళికేరి అన్నారు. సోమవారం తిప్పర్తి మండల కేంద్రంలోని రైతువేదికలో జరిగే జనగణన సర్వే శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. సర్వే రిపోర్టుపై ప్రజల భవిషత్తు ఆధారపడి ఉంటుందని అన్నారు. నమోదు చేసే ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా పరీక్షించి చేయాలని సూచించారు. నాలుగు సంవత్సరాల క్రితం చేయాల్సిన సర్వే కరోనా కారణంగా చేయలేకపోయామని ప్రస్తుతం అవకాశం ఉన్నందున విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆమె వెంట జేడీ.లాజర్, తహసీల్ధార్ ఆర్.రామకృష్ణ, ఆర్ఐ ద్రోణాఅర్జున్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.


శిక్షణలో మాట్లాడుతున్న జనగణన విభాగ రాష్ట్ర డైరెక్టర్ భారతీహోళికేరి

గుట్టలో పాలన ప్రక్షాళనపై
ప్రభుత్వం నజర్

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనంతరం సమీక్ష?
- అధికారుల సెలవులు, విదేశీ పర్యటనలపై ఆరా
- గుట్టలో ఇంటెలిజెన్స్ తనిఖీలు



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ పాలనపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. ఇటీవల దేవస్థానంలోని ఎలక్ట్రికల్ విభాగం ఇన్‌చార్జీ ఎస్ఈ వీవీ.రామారావు ఏసీబీకి చిక్కడంతో పాటు దేవస్థానంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పలు అవకతవకలు వెలుగుచూశాయి. ఈ నేపథ్యంలో దేవస్థానం పరిపాలన విభాగాన్ని ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలిసింది.
- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

తెలంగాణ తిరుపతిగా పేరొందిన యాదగిరిగుట్ట ఆలయానికి అప్రతిష్ట రాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ప్రభుత్వం ఆదేశించినట్టు తెలిసింది. ఆలయ ఈవోతో పాటు డిప్యూటీ ఈవో, పలువురు అధికారులు సెలవుపై వెళ్లడంతో ద్వితీయ శ్రేణి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో పరిపాలనలో మార్పులు, చేర్పులు చేపట్టి, భక్తులు అసౌకర్యానికి గురికాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని యోచిస్తున్నట్టు సమాచారం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులంతా ప్రచారంలో ఉన్నారు. ఈ ఎన్నిక అనంతరం యాదగిరిగుట్ట దేవస్థానంపై సమీక్షా సమావేశాన్ని ఏర్పాటుచేసి, పరిపాలనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనున్నట్టు తెలిసింది. యాదగిరిగుట్ట ఆలయ ఈవోగా ఉన్న ఎస్.వెంకట్రావ్(ఐఏఎస్) ఆగస్టు 30న ఉద్యోగ విరమణ పొందాల్సి ఉండగా, ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని రెండేళ్లు పొడిగించింది. ఆ తర్వాత 10 రోజులు మాత్రమే ఆయన విధులకు హాజరయ్యారు. సెప్టెంబరు 25 నుంచి వ్యక్తిగత సెలవులపై అమెరికా వెళ్లారు. ఆయన స్థానంలో కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు రవినాయక్‌కు ఇన్‌చార్జీ ఈవోగా గత నెల 24న బాధ్యతలు అప్పగించింది. ఆయన కూడా ఉద్యోగరీత్యా శిక్షణ కోసం వెళ్లడంతో దేవాదాయశాఖ కమిషనర్ హరీష్‌కు అదనంగా ఈవోగా బాధ్యతలు అప్పగించింది. కాగా, ఆయన ఇప్పటివరకు ఈవోగా బాధ్యతలు తీసుకోలేదు. రవినాయక్ మంగళవారం ఇన్‌చార్జీ ఈవోగా బాధ్యతలు తీసుకోనున్నట్టు తెలిసింది. గుట్ట లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో వెంకట్రావ్ నెలరోజులకు పైగా వ్యక్తిగత సెలవుపై అమెరికా వెళ్లారు. ఆయన లేనప్పుడు బాధ్యతలు చూడాల్సిన డిప్యూటీ ఈవో లండన్, యూరప్ దేశాల్లో పర్యటిస్తున్నారు. ఆలయంలో పనిచేస్తున్న కీలక అధికారులు ఒకేసారి సెలవుపై వెళ్లడంపై ప్రభుత్వం ఆరా తీసినట్టు సమాచారం. ఇదిలా ఉండగా, దేవస్థానంలో ఇంటెలిజెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు.

చెర్వుగట్టు క్షేత్రం మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష
హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖ ఛాంబర్‌లో చర్చ



నార్కట్‌పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్‌పై సోమవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ సచివాలయంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కార్యాలయం సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌తో పాటు దేవాదాయ శాఖ ప్రత్యేక సలహాదారు గోవిందహరితో పాటు ఇంజనీరింగ్ విభాగం అధికారులు కలిసి సమీక్షలో పాల్గొన్నారు. ఆలయానికి ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన మహిమాన్విత శిలాజాలు, మూలవిరాట్టు ఉన్న ఆలయం జోలికి పోకుండా భక్తుల మనోభావాలకు ఏ మాత్రం భంగం కలగకుండా ఆగమశాస్త్ర ప్రకారం చేయాల్సిన అభివృద్ధి పనుల మాస్టర్ ప్లాన్‌పై విస్తృతంగా చర్చించారు.

దేవస్థానం అభివృద్ధిలో కీలకంగా మారనున్న రెండో ఘాట్‌రోడ్డు, గిరి ప్రదక్షిణ, పారిశుధ్యం, అద్దె గదులు, ఇటు నార్కట్‌పల్లి నుంచి అటు ఎల్లారెడ్డిగూడెం నుంచి చెర్వుగట్టుకు చేరుకునే జిల్లా పరిషత్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరణ చేయడం వంటి అంశాలపై సమీక్షలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. ప్రధానంగా భక్తులకు కనీస వసతులు మెరుగయ్యేలా మరో వందేళ్ల వరకు ఉపయోగపడేలా రూపొందించాల్సిన మాస్టర్ ప్లాన్‌లో చేర్చే అంశాలపై సమీక్షించారు. రెండో ఘాట్ రోడ్డు, గిరి ప్రదక్షిణ, రోడ్డు వెడల్పులో నివాసాలు కోల్పోయే వారికి చేయాల్సిన ప్రత్యామ్నాయ అవకాశాలపై ప్రాథమికంగా చర్చకు వచ్చింది. ఐతే మరో పర్యాయం సుదీర్ఘంగా సమీక్ష చేసి మాస్టర్ ప్లాన్‌కు తుదిరూపం ఇవ్వాలని సమీక్షలో నిర్ణయించారు.

బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలి
ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

చండూరు, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చేంత వరకు సీపీఐ పోరాడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం పార్టీ మునుగోడు నియోజకవర్గ కార్యవర్గ సమావేశం చండూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ ప్రక్రియను ముందుకు తీసుకుపోయే క్రమంలో బీజేపీ కనుసన్నల్లో పని చేస్తున్న తెలంగాణ గవర్నర్ బిల్లును అడ్డుకుంటున్నారని విమర్శించారు. భారీ వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వర్షాలతో తడిసిన పత్తికి షరతులు లేకుండా గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరారు. డిసెంబరు 26వ తేదీన ఖమ్మంలో నిర్వహించే సీపీఐ 100వసంతాల ఉత్సవాల సందర్భంగా నిర్వహించే భారీ బహిరంగసభకు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రచారజాత నవంబరు 15న జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రం నుంచి ప్రారంభమైన జాతా 17వ తేదీన నల్లగొండ జిల్లాకు చేరుకుని మునుగోడు, నకిరేకల్, నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ మీదుగా ఖమ్మం చేరుకుంటుందని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు నలపరాజు రామలింగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు ఆర్.అంజాచారి, గురిజ రామచంద్రం, తీర్పాటి వెంకటేశ్వర్లు, నలపరాజు సతీష్‌కుమార్, సూదనబోయిన రమేష్, బీమనపల్లి రమేష్, బుర్ర శేఖర్, సురిగి చలపతి, బి.లాలు, బిక్షంరెడ్డి, బరిగెల వెంకటేశ్, తిప్పర్తి రాములు, పల్లె యాదయ్య పాల్గొన్నారు.



తహసీల్దార్‌గా విజయలక్ష్మి బాధ్యతల స్వీకరణ

చింతపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండల తహసీల్దార్‌గా విజయలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన రమాకాంత్‌శర్మ బదిలీపై చండూరుకు వెళ్లారు. హైదరాబాద్ జీహెచ్‌ఎంసీలో విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మి బదిలీపై చింతపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రణాళికతో కృషి చేస్తామన్నారు.

రేపు జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

నాగార్జునసాగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపిక ఈ నెల 5వ తేదీ బుధవారం అనుముల మండలం మదారిగూడెం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూలోకరావు, కర్తయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ జట్ల ఎంపికకు వచ్చే బాలురు 75 కిలోలు, బాలికలు 70కిలోల బరువు కలిగి ఉండి 20 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని తెలిపారు.

ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

• ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్

మిర్యాలగూడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లుగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకోవడం సమంజసం కాదని అన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు విడుదలకాక, కళాశాలల్లో సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో, ఫీజులు చెల్లించలేక, పైచదువులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాట ఇచ్చి బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాల మూసివేతకు యాజమాన్యాలు సమాయత్తమవుతున్నాయని అన్నారు. దీంతో పేద విద్యార్థుల భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముతున్నాయని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి ప్రత్యక్ష పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదానాయక్, జిల్లా కమిటీ సభ్యులు జగన్‌నాయక్, ప్రసన్న, సంపత్, న్యూమాన్, సూర్య, బన్ని, నాగేశ్, బురాన్, సమీర్, బాలికల జిల్లా కన్వీనర్ ప్రసన్న పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండ మార్కెట్‌లోని ఎమ్మెల్యే నివాసం ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని దేవరకొండ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జల్లెల ఇద్దిరాములు, బుడిగె వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు గుండాల మల్లేష్, రాజేష్, రోహన్, సింహాద్రి, జయరాం, మహేష్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



దేవరకొండ: ఎమ్మెల్యే నివాసం ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

● పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చే శారు. దేవరకొండ పట్టణంలోని భవిత డిగ్రీ కళాశాలను సోమవారం బంద్ చేసి నిరసన తెలిపారు. కళాశాల యాజమాన్యం సైతం బంద్ పాటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వీరేందర్, మహమ్మద్ సౌబాన్, ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి బుడిగె వెంకటేష్, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

హాలియా: హాలియాలోని ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోరే రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ కళాశాలలు సమ్మెకు పోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటని అన్నారు. వెంటనే కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరిపి పేద, మధ్య తరగతి విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జగదీష్, వర్షిత్, శివ, నాగరాజు, కార్తీక్, గోపి, వైష్ణవి, నాగమణి, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలను బంద్ చేసిన యాజమాన్యాలు

మిర్యాలగూడ టౌన్: విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ యాజమాన్యాలు కళాశాలలను బంద్ చేపట్టాయి. ఏళ్ల తరబడి బకాయిలు విడుదల చేయకపోవడంతో నిర్వహణ కష్టంగా మారిందని, వేతనాలు, విద్యుత్ బిల్లులు చెల్లించలేక నానాఅవస్థలు పడుతున్నామని ఆయా విద్యాసంస్థల నిర్వాహకులు వాపోయారు. పట్టణ పరిధిలోని మినా మహిళా ఇంజనీరింగ్, విజేత డిగ్రీ, పీజీ, హాసిత డిగ్రీ కళాశాలలతో పాటు బీఈడీ, ఫార్మసీ కళాశాలలు బంద్ చేపట్టడంతో వెనుదిరిగిన విద్యార్థులు కళాశాలల అధ్యాపకులతో కలిసి నిరసన కార్యక్రమాలు, ర్యాలీల్లో పాల్గొన్నారు. విద్యార్థుల బకాయిలు వెంటనే విడుదల చేసి, కళాశాలల బంద్‌ను విరమింపజేయాలని విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మినా మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఎండీ. మహిమూద్‌అలీ మాట్లాడుతూ ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో తమ పరిస్థితి అంపశయ్యపై ఉన్నట్లుగా ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గతంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ సందర్భంగా జరిపిన చర్చల్లో రూ.1200 కోట్లు ఈ విద్యాసంవత్సరం చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం కేవలం రూ.300 కోట్లు మాత్రమే చెల్లించిందని అన్నారు. ఈ నెల 6వ తేదీన చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో విజేత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ్, హాసిత డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మెండు వెంకట్‌రెడ్డి, కోల శ్రీనివాస్, దామిని శ్రీనాథ్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మినా మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ మహిమూద్‌అలీ, చిత్రంలో కళాశాలల యాజమానులు

కొండమల్లేపల్లి: విద్యార్థుల ఉపకార వేతనాలు, కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో కళాశాలలు నిర్వహించే పరిస్థితి లేదని శ్రీ క్రాంతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుంటోజు ఆంజనేయులు అన్నారు. డివిజన్‌లోని అన్ని ప్రైవేట్, డిగ్రీ, బీఈడీ కళాశాలల బంద్ పాటించారు. ఈ కార్యక్రమంలో శ్రీక్రాంతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దుండిగళ్ల అశోక్, చిన్నానాయక్, నరేంద్రచారి, దీపక్, నాగయ్య, శేఖర్, లిఖిత, బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యులపై చర్యలు తీసుకోవాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

మిర్యాలగూడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వ వైద్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు కోరారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వందల సంఖ్యలో రోగులు చికిత్సకోసం వస్తుంటారని అన్నారు. ఆస్పత్రిలో విధులు నిర్వహించే డాక్టర్లు రోగుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని కూడా పరీక్షించకుండా సెల్‌ఫోన్లు మాట్లాడుతూ వారి ప్రాణాలను బలిగొంటున్నారని అన్నారు. ఉదయం 10గంటలకు డ్యూటీకి వచ్చి 12గంటలకే వెళ్లిపోతున్నారని విమర్శించారు. వార్డుల్లో మంచినీరు, లైట్లు, ఫ్యాన్లు కూడా సక్రమంగా పనిచేయడం లేదని అన్నారు. గర్భిణులు డెలివరీ కోసం వెళితే నల్లగొండ ఆస్పత్రికి తీసుకెళ్లమని నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని అన్నారు. విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తున్న వైద్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి రామలింగం, జిల్లా యాదగిరి, మహిళా సమాఖ్య నాయకురాలు దాసర్ల దుర్గమ్మ, ఎస్‌కే. షమీం, బంటు రాజేశ్వరీ, పరమేష్, విజయ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

హాలియా,నవంబరు3(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ అనుముల మండల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్ పిలుపు మేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా బీసీ రిజర్వేషన్లకు సుప్రీం కోర్టులో తీర్పు రాలేదని సాకులు చెబుతూ బీసీలను మోసం చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీకి బీసీలకు నిజంగా బీసీ ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఢిల్లీకి వెళ్లి బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుని 9వ షెడ్యూల్‌లో పెట్టించి చట్టం చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మామిడి రవి, మండల కన్వీనర్ లింగాల గోవర్ధన్, మండల నాయకులు ఖమ్మంపాటి లింగయ్య, వంశీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ రెండో దశ కాల్వకు బీఎన్ రెడ్డి పేరు పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోనె కుమారస్వామి

మిర్యాలగూడరూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వీర తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి ఉమ్మడి నల్లగొండ జిల్లా ఖ్యాతిని నలుదిశలా చాటిన అగ్రగణ్యుడు భీంరెడ్డి నరసింహారెడ్డి పేరును శ్రీరాంసాగర్ రెండోదశ కాల్వకు నామకరణం చేయాలని ఎంసీపీఐయూ కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి అన్నారు. మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం కరువు, ఆకలిచావులతో అల్లాడుతున్న తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ ప్రాంతాలతో పాటు ఖమ్మం, వరంగల్ జిల్లాలో ఎగువ ప్రాంతాలకు శ్రీరాంసాగర్ రెండో దశ కాల్వ పోచంపాడు నీళ్ల ద్వారా నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలో 4.30లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని బీఎన్.రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాటం చేశారని అన్నారు. శ్రీరాంసాగర్ రెండో దశ కాల్వకు, సూర్యాపేట జిల్లాకు బీఎన్‌రెడ్డి పేరు పెట్టాలని కోరారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై బీఎన్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ కమిటీ చైర్మన్ నాగెల్లి కొమురయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వస్కుల మట్టయ్య, నాయకులు వస్కుల సైదమ్మ, పోతుగంటి కాశీ, ధీరావత్ మోహన్‌నాయక్, చంద్రకళ, మంద మల్లేష్, రామాంజి జ్యోతి, ఏర్పుల రవి, గురవయ్య, వీరన్న, సందీప్ పాల్గొన్నారు.

రామానుజాచారి సేవలు చిరస్మరణీయం

మిర్యాలగూడటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ ప్రెసిడెంట్ ముదుంబై రామానుజాచారి సేవలు చిరస్మరణీయమని రంగనాయకమ్మరంగాచార్యుల కంటి ఆస్పత్రి చైర్మన్ మొక్కపాటి వెంకటేశ్వరరావు, సోషల్‌వర్కర్ డాక్టర్ జాడి రాజు, మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు అన్నారు. రామానుజాచారి వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆస్పత్రి ఏర్పాటుతో పాటు సామాజిక కార్యక్రమాలు, శాశ్వత ప్రాజెక్టుల రూపకల్పనకు ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రనూష, కోల సైదులు, క్రాంతి, సంతోష్, మురహరి పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక సోమవారం పూజలు

దేవరకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని నందీశ్వర ఆలయం, మార్కండేయస్వామి దేవాలయాల్లో సోమవారం కార్తీక సోమవారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామునే స్నానాలు చేసి శివాలయాలకు వెళ్లి దీపాలు వెలిగించి పూజలు చేశారు. శివాలయ ఆవరణలో గోమాతకు పండ్లు, ఆహారం అందజేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సురభి కృష్ణమూర్తిశర్మ, ఆలయకమిటీ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు: గుర్రంపోడు మండలంలోని కొప్పోలు పార్వతీ బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా మహిళలు, భక్తులు అధికసంఖ్యలో పూజలు చేశారు. స్వామివారి రుద్రాభిషేకంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కొప్పోలు గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పూజలలో పాల్గొన్నారు.

చింతపల్లి: చింతపల్లి మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానంగా చింతపల్లి, వెంకటేశ్వరనగర్, కుర్మపల్లి, విరాట్‌నగర్‌లో భక్తులు ఆలయాల్లోకి వెళ్లి శివునికి పంచామృతాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



గుర్రంపోడు: కొప్పోలు శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం లక్ష్మీకల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్తీక సోమవారం సందర్భంగా ఆలయంలో తులసీ పూజ నిర్వహించిన అనంతరం లక్ష్మీ కల్యాణాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న శివాలయంలో శివునికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాదయ్య, రామానుజం, వెంకటచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పంట నష్టం పరిశీలన



పంట నష్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొండమల్లేపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడితండా, హర్యతండాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షానికి తమ పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయని, ఇళ్లు దెబ్బతిన్నాయని పేర్కొంటూ తండావాసులు ఆర్డీవో రమణారెడ్డికి విన్నవించుకున్నారు. ఈ మేరకు ఆర్డీవో, తహసీల్దార్ నరేందర్ ఆదేశానుసారం సోమవారం ఆర్ఐ ఐశ్వర్యారెడ్డి, జీపీవో హమీద్ ఆయా తండాల్లో నీట మునిగిన సుమారు 30 మంది రైతులకు చెందిన 70 ఎకరాల పొలాలను పరిశీలించారు. ఈ మేరకు నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. వారి వెంట మత్స్య సంఘం చైర్మన్ సక్రాంనాయక్, రైతులు అమర్ సింగ్, సుభాష్ చంద్రబోస్, శ్రీను, నగేష్, వెంకట్‌నాయక్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో ఎన్నో అనర్థాలు: సీడీపీవో

హాలియా, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను చేసుకోకూడదని, దీని వల్ల ఎన్నో అనర్థాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఐసీడీఎస్ అనుముల సీడీపీవో శాంతి అన్నారు. సోమవారం అనుముల ప్రాజెక్ట్ హాలియా పరిధిలోని కేజీబీవీ పాఠశాలలో బాలికలకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసుకోవద్దని, కనీసం డిగ్రీ వరకు అయినా చదువుకోవాలన్నారు. తల్లితండ్రులు బాల్య వివాహాలు చేయాలని చూస్తే 1098కి లేదా అంగన్‌వాడీ టీచర్లు, స్కూల్ టీచర్లకు సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు. అదే విధంగా పోషకాహారం, పరిశుభ్రతల గురించి అవగాహన కల్పించారు. పోక్సోచట్టం, శిశువిక్రయాలు, భ్రూణహత్యలు, గ్రామస్థాయిలో ఎక్కడైనా జరిగిన సమాచారం ఇవ్వాలని కోరారు. వారి పేరు గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో హైమావతి, పాఠశాల సిబ్బంది, సూపర్‌వైజర్ రమాదేవి, సరిత, శశికళ తదితరులు పాల్గొన్నారు.



బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో శాంతి



చింతపల్లి: కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

చిన్నారులను అక్రమంగా దత్తత తీసుకోవడం నేరం

చింతపల్లి: పుట్టిన పిల్లలను అనుమతి లేకుండా దత్తత తీసుకోవడం చట్టరీత్యా నేరమని సూపర్‌వైజర్లు పార్వతి, సుగుణ అన్నారు. చింతపల్లి మండలంలోని కేజీబీవీలో సోమవారం విద్యార్థులకు బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, దత్తతపై అవగాహన కల్పించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ చిన్నారులను దత్తత తీసుకోవాలంటే సెంట్రల్ అడాప్షన్ రీసోర్స్ అథారిటీ(ఎస్‌ఎఆర్‌ఎ) అనుమతిని పొందిన వారికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. సమాజంలోని అమ్మాయిలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ హెచ్‌ఎం వాసవి, టీచర్లు పద్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తొలగింపు సరికాదు

• కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన నాయకులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మిర్యాలగూడటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గురుకులాల నుంచి విద్యార్థులను తొలగించడం సరికాదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి అన్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పలు సాంఘిక, సంక్షేమ వసతి గృహాల నుంచి తొలగించారని ఆరోపించారు. సోషల్ వెల్ఫేర్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ శశికళ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా సుమారు 150విద్యార్థులను వార్డెన్లు అకారణంగా తొలగించడం సరికాదన్నారు. విద్యార్థులకు అవసరమైన అదనపు ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు వారిని చదువుకు దూరం చేసే చర్యలకు ఉపక్రమించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ విషయమై కలెక్టర్ ఇలాత్రిపాఠికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు సతీష్‌నేత, రాజేష్, విక్రమ్, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



ఆమనగల్లులో ఐకేపీ కేంద్రానిన ప్రారంభిస్తున్న ఏపీఎం జానకి

వేములపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే రైతుకు మద్దతు ధర లభిస్తుందని ఏవో కిశోర్‌నాయక్, ఏపీఎం జానకి అన్నారు. మండలంలోని ఆమనగల్లు, లక్ష్మీదేవిగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం వారు ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఐకేపీ కేంద్రాలకు ప్రభుత్వ ప్రమాణాల ప్రకారం ధాన్యాన్ని తీసుకువచ్చి గరిష్ఠ మద్దతు ధర రూ.2389 పొందవచ్చని అన్నారు. ధాన్యం తరలించే సమయంలోనే రైతులు తమ బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకాలను అందించాలని అన్నారు. సకాలంలో నగదు వారి ఖాతాల్లో జమ చేసేందుకు వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నితిన్, పిల్లల సందీప్, సంఘబంధం అధ్యక్షురాలు నాగమణి, సభ్యులు లక్ష్మి, ఝాన్సీ, కృష్ణవేణి, రేణుక, సరిత, తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నప్రసాద వితరణ

చింతపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన గురుస్వామి కేశగోని పరమేశ్వర్‌గౌడ్ సతీమణి చంద్రకళ దంపతుల ఆధ్వర్యంలో సోమవారం మాల ధరించిన అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ మేరకు గొడకొండ్ల రిజర్వాయిర్ ఎదురుగా ఉన్న అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. గణపతి, సుబ్రమణ్యస్వామి, అయ్యప్పకు అష్టోతర శతనామావళి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు వైద్యుల ప్రవీణ్‌కుమార్‌శర్మ, గురుస్వాములు మట్ట యాదయ్య, బండారు శ్రవణ్‌కుమార్, జంగయ్య, రఘునందన్, రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం రోజు అయ్యప్ప స్వామి మాలదారులకు కొండమల్లేపల్లి చెందిన అలుగుబెల్లి మల్లారెడ్డి మమత దంపతులు అన్నదానం నిర్వహించారు. ఈ మేరకు అన్నదాత దంపతులు మల్లారెడ్డి, మమత దంపతులను అయ్యప్పస్వామి మాలదారులు సన్మానించారు.

ఈ కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వామి చిట్టెడి ప్రభాకర్‌రెడ్డి, భూతరాజు సత్తయ్య, గుమ్మడవెల్లి జనార్ధన్, బత్తుల జంగయ్య, చెన్నగోని గణేష్, బత్తుల విజయ్, బోడ నగేష్, ఇమ్మడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.